మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 13-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 225 Issue: 225

13 ఫిబ్రవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:47 సూర్యాస్తమయం - సా. 6:13 తిథి ఏకాదశి మ. 2:23 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం మూల సా. 4:02 వరకు తరువాత పూర్వాషాఢ యోగం వజ్ర తె. 3:160 వరకు కరణం బాలవ మ. 2:23 వరకు కౌలవ తె. 3:160 వరకు వర్జ్యం మ. 2:26 నుండి సా. 4:12 వరకు దుర్ముహూర్తం ఉ. 9:04 నుండి ఉ. 9:50 వరకు మ. 12:53 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 11:04 నుండి మ. 12:30 వరకు యమగండం మ. 3:21 నుండి సా. 4:47 వరకు గుళికాకాలం ఉ. 8:13 నుండి ఉ. 9:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:11 నుండి తె. 5:59 వరకు అమృత ఘడియలు ఉ. 9:13 నుండి ఉ. 10:59 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# పాడె మోయని కులం

**కులబహిష్కరణ పేరుతో అమానవీయం**

**గ్రామ సర్పంచ్, కులపెద్దల దురహంకారం!**

**జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో దారుణం**

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కందనకుంటలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. కుల బహిష్కరణకు గురైన వ్యక్తి అంత్యక్రియల్లో పాడె మోయడానికి గ్రామస్తులు ముందుకు రాకపోవడం తీవ్ర కలకలం రేపింది.

బీర్పూర్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): కందనకుంట గ్రామానికి చెందిన ఎదుల రాజేశాన్ని కొంతకాలంగా కుల బహిష్కరణకు గురిచేసిన పెద్దలు అతను మృతి చెందడంతో పాడె మోయకూడదని -2 వ పేజీలో...



# జాహ్నవి కుటుంబానికి 262 కోట్ల పరిహారం

**అమెరికాలోని సియాటెల్ ప్రభుత్వం నిర్ణయం**

అమెరికాలోని సియాటెల్‌లో జరిగిన ఘోర కారు ప్రమాదంలో తెలుగు సంతతికి చెందిన గ్రాడ్యుయేట్ కందుల జాహ్నవి కుటుంబానికి భారీ పరిహారం లభించనుంది.

సియాటెల్: జాహ్నవి మృతి చెందిన దాదాపు మూడేళ్ల తర్వాత, ఆమె కుటుంబానికి భారీ ఆర్థిక పరిహారం అందనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవిది ఒక సాధారణ మధ్యతరగతి నేపథ్యం. విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకుని మరెంతో ఉన్నత శిఖరాలను తరువాయి 2 వ పేజీలో...



# నేడే పుర ఫలితం!

## ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు

## ఫలితాల వెల్లడిపై ఈసీ దిశానిర్దేశం

రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు శుక్రవారం వెలువడనుంది. ఉదయం 8 గంటల 123 కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీల్లో 8,04,274 ఓట్లు, 7 కార్పొరేషన్లలో 1,05,132 నిఓట్లు లెక్కించాల్సి ఉంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): స్ట్రాంగ్ రూముల్లో 16 వేల 31 బ్యాలెట్ బాక్సుల్లో ఓట్లను భద్రపరిచారు. కాగా, ఓట్ల లెక్కింపు ప్రక్రియ, ఫలితాల వెల్లడికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులకి రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ కేంద్రం వారీగా 25 బ్యాలెట్ పత్రాలని ఒక బండిల్‌గా చేసి లెక్కింపు చేపట్టాలని, ఒక్కో రౌండ్‌కు 40 కట్టలు అంటే వెయ్యి ఓట్లను కౌంటింగ్ టేబుల్‌కు పంపించేలా సూచనలు చేసింది. ఓట్లను ఏజెంట్లకు చూపించి అభ్యర్థుల వారీగా ట్రేలో వేస్తారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 100 చొప్పున బండిల్ చేస్తారు. రౌండ్లు, టేబుళ్ల తరువాయి 2 వ పేజీలో...

# నైనీ స్కాం నేనే ఆపా!

**సర్కారుకు 30 వేల కోట్లు మిగిలినయ్**

**మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు**



తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన నైనీ బొగ్గు స్కాంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనవల్లే స్కాం ఆగిందని వెల్లడించారు. 'నైనీ బ్లాక్ టెండర్లు, నాపై వచ్చిన ఆరోపణల వెనుక పెద్ద స్టోరీ ఉంది. ఓ చానెల్ ఓ రకంగా రాస్తే.. ఆ తర్వాతి రోజు మరో చానెల్, టీవీ, పేపర్ మరో రకంగా రాశాయి.

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): ప్రజలకు కూడా అర్థమైంది. వెంకట్ రెడ్డి అలాంటి వ్యక్తి కాదని. వెంకట్ రెడ్డి కారణంగా గవర్నమెంట్‌కు రూ. 20-30 వేల కోట్లు మిగిలాయనే విషయం ప్రజలకు అర్థమైంది. నిజంగానే నేను చేసిన పనితోని ప్రభుత్వానికి రూ. 30 వేల కోట్లు మిగిలినయ్. నన్ను బ్లెయిమ్ చేయాలనుకంటే అయ్యే పని కాదు' అని వ్యాఖ్యానించారు. ఈ వీడియోను ట్విట్టర్ ఎక్స్‌లో షేర్ చేసిన బీఆర్ఎస్.. అవినీతికి అడ్డా కాంగ్రెస్ అని ఫైర్ అయింది. సింగరేణిలో 30 వేల కోట్ల స్కామ్ జరిగింది నిజమని ఆరోపించింది. జరిగిన స్కాంను తానే అడ్డుకున్నానని మంత్రి కోమటిరెడ్డి తరువాయి 2 వ పేజీలో...



# నేనే రాజు.. నేనే మంత్రి

**నాకు పోటీ ఎవరు?.. సీఎం రేవంత్ వ్యాఖ్యలు**


సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడిన ఆయన, తనకు పోటీ ఎవరూ లేరని స్పష్టం చేశారు. రాబోయే పదిన్నర సంవత్సరాల పాటు తానే తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతానని, రాష్ట్రానికి తానే రాజు, తానే మంత్రిని అంటూ రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): అంతేకాదు దేశంలో జమిలి ఎన్నికలపైన వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి 2029లో జమిలి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన అంశాలపైన కూడా మాట్లాడారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,840 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,173 |

# జీపీవో సర్వీస్ రూల్స్ ఖరారు



**రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులు విడుదల**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): తెలంగాణ రెవెన్యూ శాఖలో గ్రామ స్థాయిలో పాలనను మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ గ్రామ పాలన అధికారి సబార్డినేట్ సర్వీస్ రూల్స్-2025 పేరుతో కొత్త నిబంధ నలను ఖరారు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పరిపాల నను పటిష్టం చేసేందుకు 10,954 గ్రామ పాలన అధికారి (జీపీవో) పోస్టులను ప్రభుత్వం కేటాయించింది. గతంలో పనిచేసిన వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ క్యాడర్లలో క్రమబద్ధీకరించబడిన వీఆర్ఏలను తరువాయి 2 వ పేజీలో...

# మీ దగ్గరున్న పైసలెన్ని?



రాష్ట్రంలోని యూనివర్సిటీల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. యూనివర్సిటీల ఖాతాల్లో ఉన్న 'ఫిక్స్‌డ్ డిపాజిట్ల' వివరాలు చెప్పాలని ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఇటీవల అన్ని యూనివర్సిటీల రిజిస్ట్రార్లకు విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా లేఖ రాశారు. వెంటనే ఎఫ్‌డీల వివరాలు పంపాలని ఆదేశించారు.

**వర్సిటీ ఎఫ్‌డీల సంగతేంది?**

**అన్ని వర్సిటీల్లో వివరాలు చెప్పండి**

**రిజిస్ట్రార్లకు విద్యాశాఖ లేఖ**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): దీంతో వర్సిటీ వర్గాల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే నిధుల కొరతతో సతమతమవుతున్న వర్సిటీల నుంచి.. ఉన్న కాస్తో కూస్తో నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందా లేక ఎఫ్‌డీలు ఉన్నాయనే సాకుతో బ్లాక్ గ్రాంట్లు ఆపేస్తుందా..? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థుల ఫీజులు, పరీక్షల ఫీజులు, ఇతర మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని వర్సిటీలు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



కావాలని ఫోన్లను పనిచేయకుండా చేయడం, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా పాత మోడళ్ల ఫోన్ల జీవిత కాలాన్ని తగ్గించే ప్రయత్నం చేయడం చట్టరీత్యా నేరం. తొలిసారి ఫ్రాన్స్ ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఐఫోన్లు నెమ్మదించేలా యాపిల్ కంపెనీ కుట్రలు చేసిందన్న ఆరోపణల నేపథ్యంలో ఆ దేశం చట్టాన్ని అమల్లోకి తెచ్చింది.

# అన్ని బండ్లకు రేడియం!

**రిఫ్లెక్టివ్ టేపులు అతికించాల్సిందే.. రేర్ మార్కింగ్ ప్లేట్లు తప్పనిసరి**

**రవాణాశాఖ కీలక నిర్ణయాలు.. 5 కంపెనీలకు తయారీ బాధ్యతలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా రవాణా శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాత్రి సమయంలో రోడ్లపై తిరిగే వాహనాలు ఇతర వాహనదారులకు స్పష్టంగా కనిపించేందుకు వాటిపై క్యూఆర్ ఆధారిత రిఫ్లెక్టివ్ టేపులు అమర్చాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర మోటార్ వాహనాల నియమాలు, 1989 లోని రూల్ 104 -104(ఈ) ప్రకారం రిఫ్లెక్టివ్ టేపులు, రేర్ మార్కింగ్ ప్లేట్లు అమర్చడం తప్పనిసరి అని పేర్కొంది. వాహనాలపై క్యూఆర్ -2 వ పేజీలో...



# 3 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. అమెరికాలో జనవరికి సంబంధించి అంచనాల కంటే మెరుగైన జాబ్స్ డేటా రావడం మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. మెరుగైన జాబ్స్ డేటా వల్ల ఇప్పట్లో ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికితోడు తరువాయి 2 వ పేజీలో...

# వలపు వలలో పడొద్దు

## సీపీ సజ్జనార్ సూచన




హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): వాలంటైన్స్ డే పేరుతో ఎవరూ కూడా వలపు వలలో పడొద్దని సీపీ సజ్జనార్ సూచించారు. 'వాలెంటైన్స్ డే అంటే కేవలం గులాబీలే కాదు.. ప్రమాద ఘంటికలు కూడా! సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్‌లో మీరు తోడు కోసం వెతుకుతుంటే.. సైబర్ కేటుగాళ్లు మీ బ్యాంక్ ఖాతాను ఖాళీ చేయడానికి కాచుకుని ఉంటారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఎవరూ కూడా వలపు వలలో పడొద్దు' అని హెచ్చరించారు పరిచయం అయిన వెంటనే ఐ లవ్ యూ చెప్పడం, విదేశాల్లో ఉన్నామంటూ గొప్పలు చెప్పడం, హఠాత్తుగా ఆపద వచ్చిందని నాటకాలాడటం.. ఇవన్నీ మిమ్మల్ని బుట్టలో వేసుకునే ఎత్తుగడలేనన్న విషయం గ్రహించాలని సూచించారు.

## రాశి ఫలాలు

13.2.2026

మేషం: చిన్ననాటి మిత్రుల కలయిక సంతోషాన్నిస్తుంది. విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున శుభకార్యాలు కొన్ని నిర్వహిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి.

వృషభం: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటాబయట కొద్దిపాటి సమస్యలు ఉంటాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహ పరుస్తాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలుంటాయి.

మిధునం: బంధువులతో అకారణ తగాదాలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య సమస్యలు కొంత కలచి వేస్తాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ధన వ్యవహారాలలో జాగ్రత్త అవసరం.

కర్కాటకం: రావలసిన బాకీలు సకాలంలో వసూలవుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. గృహమున సంతోషంగా గడుపుతారు.

సింహం: మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. బంధు మిత్రుల నుండి కొత్త విషయాలు తెలుసుకుంటారు. సోదరులతో చర్చల్లో పురోగతి సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు అదిగమిస్తారు. ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది.

కన్య: చేపట్టిన పనులలో కష్టమే తప్ప ఫలితం కనిపించదు. ఆస్తి వివాదాలు కొంత చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనుల్లో అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

తుల: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. దూరప్రయాణాలు శ్రమతో కూడినవిగా ఉంటాయి. అనుకున్న పనులలో జాప్యం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు కలుగుతాయి. ఉద్యోగమున అదనపు పని బాధ్యతలు పెరుగుతాయి.

వృశ్చికం: మొండి బాకీలు వసూలవుతాయి. ఆప్తుల నుండి ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. వృత్తి, వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

ధనస్సు: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు మధ్యలో వాయిదా వేస్తారు. శ్రమతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. బంధుమిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి. ఉద్యోగస్థులకు స్థానచలన సూచనలున్నవి.

మకరం: ఉద్యోగమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. నూతన వాహన యోగం ఉన్నది. ఇంటాబయట గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు.

కుంభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. చిన్ననాటి మిత్రులతో విభేదాలు కలుగుతాయి. ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి.

మీనం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. బంధు మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు ఆశించిన రీతిలో సాగుతాయి.





# ..262 కోట్ల పరిహారం

మొదటి పేజీ తరువాయి

అధిరోహించాలన్న కోటి కలలతో సియాటెల్‌లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు 2021లో అమెరికాకు వెళ్లింది. 2023, జనవరి 23వ తేదీ రాత్రి ఒక మలుపు దగ్గర రోడ్డు దాటుతున్న 23 ఏళ్ల జాహ్నవిని, కెవిన్ డవే అనే పోలీస్ అధికారి నడుపుతున్న పెట్రోలింగ్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఆ ధాటికి దాదాపు 100 అడుగుల దూరం ఎగిరిపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన తర్వాత బయటకు వచ్చిన వీడియో సంచలనం రేపింది. ప్రమాదం జరిగిన తర్వాత మరో పోలీస్ అధికారి డేనియల్ ఆడరర్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఏముంది మామూలు మనిషేగా...11 వేల డాలర్లు చెల్లిస్తే సరిపోతుందిగా! అంటూ ఎద్దేవా చేశాడు. అయితే తన బాడీ కెమెరా ఆన్ చేసి ఉందనే సంగతి మరిచిపోయాడు. అతని మాటలు వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహ జ్వాలలు రగిలాయి. తమ బిడ్డ మృతిపై జాహ్నవి కుటుంబం దావా వేసింది. ఈ సంఘటన తెలుగు, భారతీయ వర్గాల నుండి మాత్రమే కాకుండా, స్థానికులు కూడా ప్రజల ఆగ్రహాన్ని వ్యతిరేకతను రేకెత్తించింది. దీంతో భారీ పరిహారంతో ఈ కేసును పరిష్కరించుకుంది. సియాటెల్ నగరం దాదాపు రూ. 262 కోట్ల (28 మిలియన్ డాలర్ల) పరిహారం చెల్లించేందుకు అంగీకరించింది.



# పాడె మోయని కులం

మొదటి పేజీ తరువాయి

గ్రామ సర్పంచ్‌తో పాటు కులపెద్దలు ఆజ్ఞాపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్తులు మాత్రమే కాకుండా దూరపు చుట్టాలు కూడా పాడె మోయరాదని స్పష్టంగా చెప్పినట్లు బాధిత కుటుంబ సభ్యుల సమాచారం. పాడె మోయాలని సర్పంచ్, పెద్దలను కాళ్లకు మొక్కి వేడుకున్నా వారు కనికరం చూపలేదని తెలిపారు. ఈఘటనతో మృతుడి శరీరాన్ని ముట్టుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరకు అతని భార్య, అక్కలు, సొంత కుటుంబ సభ్యులే పాడె మోయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సంఘటన గ్రామంలో కుల వివక్ష ఎంత లోతుగా ఉందో మరోసారి బయటపెట్టింది. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు డిమాండ్లు వెల్లువెత్తాయి. కాగా, ఘటనపై బీర్పూర్ ఎస్సై రాజు కేసు నమోదు చేశారు. గ్రామ పరిపాలన అధికారి ఎస్‌కే రఫీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# నేనే రాజు.. నేనే మంత్రి

మొదటి పేజీ తరువాయి

కేసుపైన మాట్లాడిన సీఎం రేవంత్ ఈ కేసులో దర్యాప్తు చివరి దశకు చేరుకుందని అన్నారు. దర్యాప్తు ఆధారంగా కేసులో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. తనకు ఎవరి విషయంలోనూ కక్షలు లేవని, తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒకవేళ కేసీఆర్ ను జైలులో పెట్టాలంటే అది నిబంధనల ప్రకారమే జరుగుతుందని వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎవరి ఫోన్లను ట్యాప్ చేయలేదని స్పష్టం చేశారు. ఫోన్ సంభాషణలను ట్యాప్ చేస్తే ఆయుష్షు తగ్గుతుందని ఎద్దేవా చేశారు. ఇతరుల కాల్స్ వినడం ఒక మానసిక రోగం అంటూ ఘాటుగా స్పందించారు. సింగరేణికి రాష్ట్రప్రభుత్వం బకాయిలు ఉన్నాయన్న అంశంపై స్పందించిన రేవంత్ రెడ్డి.. కేసీఆర్ హయాం నుంచి ఆ బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. పదేళ్లపాటు కేసీఆర్‌ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక్క మాట కూడా అడగలేదని, ఇప్పుడు తనని ఎందుకు ప్రశ్నిస్తున్నారని అడిగారు.

### గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు రండి

ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఉదయం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్రమంత్రిని ఆహ్వానించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో దీన్ని చేపడుతున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు రాజ్‌నాథ్‌కు రేవంత్ వివరించారు. అటు.. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడుతోనూ రేవంత్ భేటీ అయ్యారు. తెలంగాణలోని ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనులకు సంబంధించి రామ్మోహన్ నాయుడుకు పలు విజ్ఞప్తులు చేశారు. వరంగల్‌లోని మామూనూరు ఎయిర్‌పోర్టు కోసం భూ సేకరణ ప్రక్రియ పూర్తి అయిందని, విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి పాల్వంచలో స్థలం గుర్తించినట్లు వివరించారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజుబిలిటీ స్టడీని పాల్వంచలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. పెద్దపల్లి జిల్లాలోని అంతర్గాం



విమానాశ్రయ నిర్మాణానికి.. ప్రత్యామ్నాయ స్థలం గుర్తించామని.. ఈ నేపథ్యంలోనే వెంటనే దానికి అనుమతులు మంజూరు చేయాలని రామ్మోహన్ నాయుడుకు సీఎం రేవంత్ రెడ్డి వినతిపత్రం అందించారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి అదనంగా మరో 249.82 ఎకరాల భూమిని సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

# అన్ని బండ్లకు రేడియం!

మొదటి పేజీ తరువాయి

ఆధారిత మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా ధ్రువీకరణ విధానాన్ని అమలు చేయనున్నట్లు రవాణా శాఖ తెలియజేస్తోంది. ఈ విధానం ఈ నెల 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నట్టు స్పష్టం చేసింది. అయితే ఇందుకోసం ప్రభుత్వం 5 కంపెనీలను ఎంపానెల్ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దరఖాస్తులను పరిశీలించి ఈ ఐదు తయారీదారులను ఎంపానెల్ చేయడం జరిగింది. వీటిలో ఇండియా లిమిటెడ్, ఒరఫఫోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అవెరి డెన్నిసన్ ఇండియా, గ్లోడియన్ రిఫ్లెక్టివ్, డోమింగ్ రిఫ్లెక్టివ్ మెటీరియల్స్ సంస్థలు ఉన్నాయి. వాహనదారులు ఈ సంస్థలకు చెందిన అధీకృత డీలర్లు, అప్లికేటర్ల ద్వారా తమ వాహనాలకు రిఫ్లెక్టివ్ టేపులు వేయించుకోవాల్సి ఉంటుంది. ఆ టేపులపై తెలంగాణ రవాణా శాఖ లోగోతో కూడిన హోలోగ్రామ్, ప్రత్యేక సీరియల్ నంబర్ కలిగిన క్యూఆర్ కోడ్ కచ్చితంగా ఉండాలి. అయితే ఈ క్యూఆర్ ఆధారిత రిఫ్లెక్టివ్ టేపులను అందించేందుకు ఆయా కంపెనీలు వాహనదారుల నుంచి అదనపు చార్జీలను వసూలు చేయకుండా ఉండేందుకు ప్రభుత్వంమే వాటి ధరలను నిర్ణయించింది. అఫిక్సేషన్, సర్టిఫికెట్ చార్జీలు కూడా ఇందులోనే ఉండనున్నట్టు రవాణా శాఖ స్పష్టం చేసింది.

# జీపీవో సర్వీస్ రూల్స్ ఖరారు

మొదటి పేజీ తరువాయి

ఈ పోస్టుల్లో నియమించనున్నారు. వీటితో పాటు నేరుగా నియామకం ద్వారా కూడా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. జీపీవో పోస్టులకు గాను నేరుగా నియామకమయ్యే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బదిలీ ద్వారా వచ్చే మాజీ వీఆర్వో, వీఆర్ఏ అభ్యర్థులు డిగ్రీ లేదా ఇంటర్మీడియట్‌తో పాటు కనీసం ఐదేళ్ల సర్వీసు కలిగి ఉండాలనే నిబంధన పెట్టారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 34 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొన్నారు. అయితే, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్ల వయోసడలింపు ఉంటుందని సర్వీస్ రూల్స్‌లో స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు విధులకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ ఉంటుంది. నేరుగా నియామకమైన వారు విధుల్లో చేరిన రెండేళ్ల లోపు నిర్దేశిత పరీక్షలైన పవర్స్ అండ్ డ్యూటీస్ ఆఫ్ జీపీవో, విలేజ్ మాన్యువల్ ఆఫ్ అకౌంట్స్, సర్వే ఎగ్జామ్స్ పాస్ అవ్వాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసిన తర్వాత కనీసం మూడేళ్ల పాటు ప్రభుత్వానికి సేవలు అందిస్తామని బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. జీపీవో కేడర్‌లో పనిచేస్తున్న వారికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందే అవకాశం కల్పించారు. ఇందుకోసం 60:40 నిష్పత్తిని అమలు చేయనున్నారు. ఈ పోస్టులకు జిల్లా కలెక్టర్ నియామక, క్రమశిక్షణా అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లాను ఓ యూనిట్‌గా పరిగణించి నియామకాలు, బదిలీలు చేపడతారు.

# నేడే పుర ఫలితం!

మొదటి పేజీ తరువాయి

వారీగా అభ్యర్థులు నోటా, చెల్లని ఓట్ల వివరాలు నమోదు చేసి చివరకి ఫలితాలు ప్రకటించనున్నారు. ఓట్ల లెక్కింపు కోసం సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లని రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇచ్చింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు మాత్రమే ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఎస్ఈసీ స్పష్టంచేసింది. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తులకు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని తెలిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎస్ఈసీ, డీజీపీ, కలెక్టర్ల కార్యాలయాల్లో ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు.

# నైనీ స్కాం నేనే ఆపా!

మొదటి పేజీ తరువాయి



వెంకట్ రెడ్డి అంటున్నారని దీన్నిబట్టే కాంగ్రెస్ బీజేపీ ఒక్కటిని తేలిపోయిందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్, కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరివాలని.. దోషులను శిక్షించాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. కాగా, నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి, ఓ మీడియా చానెల్ యజమాని అల్లుడు, మంత్రి కోమటిరెడ్డి పేర్లు ప్రధానంగా తెరపైకి వచ్చాయి. మంత్రులు వారి వ్యాపార భాగస్వాములకు లబ్ధి చేకూర్చేందుకు టెండర్ నిబంధనలను మార్చారని, సైటి విజిటింగ్ సర్టిఫికేట్ విషయంలోని అవకతవకలు జరిగాయని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ఘాటుగా ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతోనే ఈ ప్రక్రియ జరిగిందని వాదించారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. తాను ఏ తప్పు చేయలేదని కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారంటూ కౌంటర్ ఇచ్చారు. ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నైనీ బ్లాక్ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# మీ దగ్గరున్న పైసలెన్ని?

మొదటి పేజీ తరువాయి

మలుచుకుంటాయి. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, అత్యవసర సమయాల్లో జీతాలు, చిన్నచిన్న అభివృద్ధి పనులకు ఈ వడ్డీ నుంచే ఖర్చు చేస్తుంటాయి. అయితే, హఠాత్తుగా ఇప్పుడు విద్యాశాఖ ఈ ఎఫ్‌డీల వివరాలు అడగటం చర్చనీయాంశంగా మారింది. ఒక్కో వర్సిటీలో ఎన్ని కోట్ల డిపాజిట్లు ఉన్నాయి? అవి ఏ బ్యాంకుల్లో ఉన్నాయి? వాటి కాలపరిమితి ఎంత? అనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. అయితే, ఈ సమాచారంతో వర్సిటీ నిధులకు కోత పెట్టే అవకాశాలు ఉన్నాయా? అని విద్యార్థుల, వర్సిటీల వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

# 3 లక్షల కోట్ల సంపద ఆవిరి

మొదటి పేజీ తరువాయి

ఐటీ షేర్లను ఏఐ భయాలు వెంటాడాయి. ఇటీవల వరుస లాభాల వేళ గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ సూచీలపై ఒత్తిడి పడింది. ఐటీ స్టాక్స్‌ను ఆంత్రోపిక్ భయాలు ఇంకా వెంటాడుతున్నాయి. దీనికితోడు అమెరికాలో వెలువడిన జాబ్స్ డేటా కూడా ఐటీ షేర్లపై ప్రభావం చూపింది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించకపోతే అమెరికన్ కంపెనీలు తమ ఖర్చులను తగ్గించుకుంటాయి. దీనివల్ల మన ఐటీ కంపెనీలకు ఆర్డర్లు తగ్గుతాయి. ఈ నేపథ్యంలో నేడు ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ వంటి షేర్లు భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 5 శాతం మేర పతనమైంది. బీఎస్ఈలో మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు క్షీణించింది.



# ఉగాదికి సనత్‌నగర్ టిమ్స్

## ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ రివ్యూ.. మార్చి రెండో వారానికల్లా పనుల పూర్తికి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): పేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఉగాది పండుగ రోజున ఈ హాస్పిటల్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్‌మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి, హాస్పిటల్‌ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో టిమ్స్ సనత్‌నగర్ పనుల పురోగతి, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపీ రూమ్‌లు, డయాగ్నస్టిక్స్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. 1000 బెడ్ల కెపాసిటీతో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్‌లో మౌలిక వసతుల కల్పన తుది దశకు చేరుకుందని అధికారులు మంత్రికి వివరించారు. హాస్పిటల్ అత్యంత కీలకమైన 16 ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ జరుగుతోందన్నారు. మార్చి రెండో వారం నాటికి అన్ని పనులు, ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్ ప్రారంభమయ్యే నాటికి టెక్నీషియన్లకు, సిబ్బందికి ట్రైనింగ్ కూడా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు చివరి దశలో ఉన్నాయని, ఓటీలు ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. నగరంలోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్‌పై పెరుగుతున్న రోగుల ఒత్తిడిని తగ్గించేందుకు టిమ్స్ సనత్‌నగర్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఆయా హాస్పిటళ్లలో శస్త్రచికిత్సల కోసం నెలల తరబడి వేచి చూస్తున్న రోగులను ఇక్కడికి రిఫర్ చేసి, త్వరితగతిన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. దీనికి సంబంధించి ఆయా హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు.

### నాన్ మెడికల్ సర్వీసెస్‌పై స్పెషల్ ఫోకస్

హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. పూర్తిగా కొత్త హాస్పిటల్ అయినందున.. డీఎంఈ, నిమ్స్ పరిధిలోని సీనియర్ డాక్టర్ల సేవలను సనత్‌నగర్ టిమ్స్‌లో వినియోగించుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. అలాగే, పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే నగరంలోని పలు కార్పొరేట్ హాస్పిటల్స్, నిమ్స్, ఎయిమ్స్‌లో అనుసరిస్తున్న పద్ధతులను డీఎంఈ నేతృత్వంలోని కమిటీ అధ్యయనం చేసి, నివేదిక అందజేసింది. ఆయా హాస్పిటల్స్‌లో అవలంభిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ విధానాలనే టిమ్స్‌లోనూ అమల్లోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

### టెక్నాలజీతో మెరుగైన సేవలు..

రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ-హెచ్ఎంఐఎస్ (వ-నవీఖా) సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలను అనుసంధానించాలని మంత్రి సూచించారు. రోగులకు, వారి సహాయకులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులన్నీ పూర్తి చేసి, ఉగాది నాటికి హాస్పిటల్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

## అడ్డదిడ్డంగా జీహెచ్ఎంసీ విభజన

**హేతుబద్ధత లేనేలేదు: సబిత ఇంద్రారెడ్డి**

**తప్పులు సరిదిద్దుకోవాలని సీఎంకు లేఖ**

మహేశ్వరం, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): గ్రేటర్ హైదరాబాద్ పరిధిని మూడు కార్పొరేషన్లుగా విభజించిన తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హేతుబద్ధత లేకుండా, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆమె ఖండించారు. జీహెచ్ఎంసీ విభజనతో నెలకొన్న గందరగోళంపై సబిత గురువారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తప్పు పట్టారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా.. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామని ఆమె లేఖలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని పట్టణ ప్రాంతాలను రెండు వేర్వేరు కార్పొరేషన్లలో కలపడం వెనుక ఉద్దేశం ఏంటి? అని సీఎం రేవంత్ రెడ్డిని సబిత ప్రశ్నించారు. అగానే, సైబరాబాద్‌కు దగ్గరగా ఉన్న బండ్లగూడ, రాజేంద్రనగర్, శంషాబాద్ వంటి ప్రాంతాలను హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలపడం ఏంటి?, మల్కాజ్‌గిరి కార్పొరేషన్‌కు పక్కనే ఉన్న బడంగ్‌పేట్, తుక్కుగూడ, మీర్‌పేట్ వంటి ప్రాంతాలను హైదరాబాద్ కార్పొరేషన్‌లో కలపడం వెనక మతలబు ఏంటి? అని ఆమె కాంగ్రెస్ ధోరణిని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలపై భారాన్ని మోపే నిర్ణయాలను విరమించుకోవాలని, ప్రభుత్వం తన తప్పును సరిదిద్దుకోవాలి అని సబితా రెడ్డి డిమాండ్ చేశారు.

## మహదేవప్ప సూసైడ్‌తో నాకేం సంబంధం: వాకిటి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): మక్తల్ మున్సిపాలిటీలో 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలు రుజువైతే తాను దేనికైనా సిద్ధమని అన్నారు. మహదేవప్పను బెదిరించినట్లుగా జరిగిన ప్రచారంపై మంత్రి స్పందించారు. బీజేపీ అభ్యర్థికి తాను ఎప్పుడూ ఫోన్ చేయలేదని స్పష్టం చేశారు. తన ఫోన్ కాల్ డేటాను పరిశీలించవచ్చని అన్నారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వాస్తవాలు వెలుగు చూస్తాయని అన్నారు. మహదేవప్ప ఆత్మహత్య కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. ఎన్నికల భయంతోనే మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని వివరించారు. కాగా, మహదేవప్ప ఆత్మహత్యకు సంబంధించి ఆయన భార్య సత్యమ్మ పోలీసులకు ఇచ్చిన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తనకు ఎవరూ ఓటు వేయరనే భయంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె పోలీసులకు లేఖ ఇచ్చారు. ఓడిపోతాననే భయంతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.

## క్యాన్సర్ బాధిత జర్నలిస్ట్‌కు బీఆర్ఎస్ నేత సాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): కష్టాల్లో ఉన్న క్యాన్సర్ బాధిత జర్నలిస్ట్ ఖాజా కుటుంబానికి బీఆర్ఎస్ నేత భరోసానిచ్చారు. ఆయన దీనస్థితిని తెలుసుకున్న బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయల కార్తీక్ రూ.50వేలు సమకూర్చగా, గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన నివాసంలో బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఖాజా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేటీఆర్, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అధైర్యపడొద్దని, పార్టీపరంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం చేసిన కార్తీక్‌ను అభినందించారు. ఆపదలో అండగా నిలిచిన కేటీఆర్, కార్తీక్‌కు ఖాజా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందు లో తెలంగాణ ఉద్యమకారుడు సంగారెడ్డి ఉన్నారు.

## 12 వేల మంది పోలీసులతో పహారా

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగే మున్సిపల్ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 12 వేల మంది పోలీసు బలగాలు పహారా కాస్తాయని డీజీపీ బీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. పోలీసులతోపాటు సాయుధ బలగాలు, క్విక్ రెస్పాన్స్ బృందాలు కూడా నిరంతరం పహారా కాస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల ఓట్ల లెకింపు కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## కార్యకర్తలే బీఆర్ఎస్‌కు వెన్నెముక


**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): హైదరాబాద్ మహానగరంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఒకటి కాదు, ఎన్ని కార్పొరేషన్లు చేసినా ఎగిరేది మాత్రం ఖచ్చితంగా గులాబీ జెండానేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన యువ నాయకుడు విజయ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోకేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేలు పోయినా.. పార్టీ వెన్నెముక కార్యకర్తలేనన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీని వీడినా, కార్యకర్తలు మాత్రం చెక్కుచెదరకుండా కేసీఆర్ నాయకత్వంలోనే ఉన్నారని ప్రశంసించారు. మొత్తం హైదరాబాద్‌లోనే శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీకి నంబర్ వన్ కోటగా నిలిచింది. స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు వెళ్లినా, బంగారం వంటి కొత్త నాయకులు వందల సంఖ్యలో పార్టీలో చేరుతున్నారు. శేరిలింగంపల్లిలోని 24 డివిజన్లలో క్లీన్ స్వీప్ చేసే సత్తా మనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అరిచేతుల వైకుంఠం చూపి అధికారం దక్కించుకుందని కేటీఆర్ విమర్శించారు. మరోవైపు బీజేపీ 12 ఏళ్లుగా తెలంగాణకు 12 పైసల పని కూడా చేయలేదని, అది 'పూజకు పనికిరాని పువ్వు' అని ఎద్దేవా చేశారు. 'వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి' అన్న నానుడిని గుర్తు చేస్తూ, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టపగలే సుల్తాన్ బజార్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో దోపిడీలు, చందానగర్‌లో జ్యువెలరీ షాపులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యాపారాలు, వాణిజ్య సంస్థలు కుదేలయ్యాయని, కొత్త కొలువులు రాకపోగా ఉన్నవి పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. త్వరలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు కేటీఆర్. ఎమ్మెల్యే లేదని భయపడకండి, మీకు అండగా నేను, తలసాని శ్రీనివాస్ యాదవ్, అరికెపూడి, కృష్ణారావు ఉంటాం. ఏ అవసరమొచ్చినా మేము అందుబాటులో ఉంటాం" అని కేటీఆర్ హామీ ఇచ్చారు. తప్పుడు ఓటు వేస్తే ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించాల్సి వస్తుందని, ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని.. ముఖ్యంగా మహిళా లోకానికి కేటీఆర్ విన్నవించారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడం శుభపరిణామమని, విజయ్ కుమార్ రెడ్డి వంటి యువకులు పార్టీకి ఆస్తి అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు , నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థుల రోడ్లమీదికొస్తున్నా పట్టింపేది?

### సీఎంకు ఆ మాత్రం తీరికలేదా.. సిగ్గుచేటు.. రేవంత్‌పై మాజీమంత్రి హరీశ్ ధ్వజం



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక పాఠశాలలో భోజనంలో కల్తీ జరిగి అస్వస్థతపాలవుతున్న విద్యార్థులపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించే తీరికలేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ మండలం ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కల్తీ ఆహారం మాకొద్దు అంటూ రోడ్డెక్కిన విషయం, హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో భోజనం బాగుండటం లేదని విద్యార్థుల నిరసనలపై ట్వీట్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గురుకులాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం విచారకరమన్నారు. ఉస్మానియాకు వెళ్లి రిబ్బన్లు కట్ చేయడం తప్ప రెండున్నరేండ్లుగా చేసిన అభివృద్ధి ఏముంది? అని ప్రశ్నించారు. మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటదు అనడానికి ముఖ్యమంత్రి పర్ఫెక్ట్ ఉదాహరణ అని ఎద్దేవ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే అంటూ ఇప్పటి వరకు 62 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి సాధించిదేమిటో మొన్నటి కేంద్ర బడ్జెట్ తోనే తేటతెల్లమైందని విమర్శించారు. ఒకవైపు గురుకులాల ఖ్యాతిని మసకబార్చిన రేవంత్ రెడ్డి, మరో వైపు అంచనాలు పెంచి కమీషన్లు దండుకోవడానికే యంగ్ ఇండియా స్కూల్స్ పేరిట భారీ నాటకానికి తెరతీసిందని ఆరోపించారు. కూట్లో రాయి తీయలేనోడు, ఏట్లో రాయి తీస్తడట అన్నట్లు ఉన్న గురుకులాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టలేని ప్రభుత్వం, అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పురుగుల్లేని అన్నం కోసం విద్యార్థులు నడిరోడ్డెక్కి నిరసన తెలియచేయాల్సిన దుస్థితి కల్పించడమేనా ఇందిరమ్మ రాజ్యం? ఉస్మానియా విద్యార్థులు, తల్లిదండ్రులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అవమానించడమేనా మీ ప్రజాపాలన? రేవంత్ రెడ్డి పరిపాలన అంటే ప్రగల్భాలు పలకడం కాదు. ప్రతిపక్షాలపై బూతుల వర్షం కురిపించడం అంతకంటే కాదు. హార్వార్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లి వచ్చినా కూడా.. మీరు విద్య పట్ల, విద్యార్థుల పట్ల ప్రాధాన్యం చూపకపోవడం శోచనీయం. ఇప్పటికైనా విద్యాశాఖ మీద దృష్టి సారించి, గురుకుల విద్యార్థులకు పురుగుల్లేని భోజనం అందించాలని డిమాండ్ చేశారు.



## బిడ్డల నుంచి నా ఆస్తి ఇప్పించండి

**ఆర్డీవోకు ఓ తండ్రి అర్జీ**

సికింద్రాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): తాను కన్నబిడ్డలు తన ఆస్తులు పంచుకుని, తనను నిర్లక్ష్యం చేస్తున్నారని ఓ 70 ఏళ్ల తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన బాగోగులు చూడనందుకు తన ఆస్తులను తనకు తిరిగి ఇప్పించాలని ఆయన ఆర్డీవోకు అర్జీ పెట్టుకున్నారు. తాను పంచి ఇచ్చిన ఆస్తులను తనకు తిరిగి ఇప్పించి, కుమార్తెల వేధింపుల నుంచి తనను రక్షించాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నగరంలోని సికింద్రాబాద్ వెస్ట్‌మారేడుపల్లికి చెందిన ఎం రాజలింగం (70) కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె భాగ్యలక్ష్మి ఓ ప్రైవేటు సంస్థలో మేనేజర్‌గా, రెండో కుమార్తె ఝాన్సీ మెడికల్ డిపార్టుమెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన భార్య మరణానంతరం ఆ ఇద్దరు బిడ్డలు తన ఆస్తులు పంచుకుని, తనను పట్టించుకోవడం లేదని రాజలింగం ఆరోపిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలకు తన 130 గజాల ఇంటి జాగాలో చెరో 65 గజాలు, తన భార్య 15 తులాల బంగారం చెరో ఏడున్నర తులాలు ఇచ్చానని రాజలింగం చెబుతున్నారు. పెద్ద కుమార్తె ఇంటిలో మూడు గదులు ఉన్నా తనను బాత్రూమ్ దగ్గర ఉన్న ఒక గదిలో బందీని చేశారని, మిగతా గదులకు తాళాలు వేసుకుంటారని ఆయన ఆరోపించారు. రెండో కుమార్తె ఝాన్సీ ప్రభుత్వం ఉద్యోగం ఉన్నా, తాను ఇచ్చిన ఆస్తిపై నెలకు రూ.22 వేల అద్దె వస్తున్నా తనకు కేవలం నెలకు రూ.1500 ఇచ్చి చేతులు దులుపుకుంటోందని రాజలింగం చెప్పారు. మూడో కుమార్తె ఉందని చెప్పిన రాజలింగం ఆమె గురించి వివరాలు వెల్లడించలేదు. తనను నిర్లక్ష్యం చేస్తూ వేదనకు గురిచేస్తున్న ఇద్దరు బిడ్డల నుంచి తన ఆస్తులను తిరిగి ఇప్పించాలని ఆర్డీవోను కోరారు.

## జగ్గారెడ్డిపై కేసు నమోదు



సంగారెడ్డి/నిజామాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): ఎన్నికల సంఘం ఆదేశాలతో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసు నమోదైంది. సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో జగ్గారెడ్డిపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారని బుధవారం రాత్రి 9గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి వినయ్ కుమార్. జగ్గారెడ్డిపై బీఎన్ఎస్ 223,351,352,132,329,191(2) సెక్షన్లతో పాటు 215(1)(బీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏ1గా జగ్గారెడ్డి, ఏ2గా అడ్డు అలియాస్ హమీద్‌ను చేర్చారు. దీనిపై సీఐ శివకుమార్ వివరణ ఇచ్చారు. అడ్డు అలియాస్ హామీద్ అనే వ్యక్తి పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ తీసుకుని తరచుగా వస్తుండటంతో రావొద్దని చెప్పామని సీఐ శివకుమార్ స్పష్టం చేశారు. అయినా మాట వినకుండా ఎన్నికల సిబ్బందిని బెదిరించి ప్రశాంత వాతావరణానికి ఇబ్బంది కలిగించారని, గేటు వద్ద కూడా పోలీసులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడన్నారు. విధి నిర్వహణలో ఉన్న సీఐ శివకుమార్ అతన్ని వారించడంతో తాను జగ్గారెడ్డి మనిషినని చెప్పాడని, తననే ఆపుతావా.. ఎన్నికలు ఎలా జరుగుతాయో చూస్తానని బెదిరించాడన్నారు. విషయం జగ్గారెడ్డికి తెలియడంతో ఆయన తన అనుచరులతో ఇంద్రానగర్ పోలింగ్ కేంద్రానికి వచ్చారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అక్కడ విషయాన్ని పెద్దది చేశారన్నారు. అంతటితో ఆగకుండా తనపై దాడి చేసేందుకు యత్నించారని సీఐ శివకుమార్ తెలిపారు. నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లి అధికారులు, పోలీసులను ఉచ్ఛరించలేని విధంగా దుర్భాషలాడారు.

## ఉద్యోగులకు కొత్త 'ఆరోగ్యం'

**ఈహెచ్ఎస్ స్థానంలో కొత్త స్కీం!**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కొత్త ఆరోగ్య పథకాన్ని ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే పక్షం రోజుల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. గెజిటెడ్, నాన్-గెజిటెడ్, నాలుగో తరగతి ఉద్యోగులతో పాటు పెన్షనర్లు కూడా ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వి. ఆనంద్, మహేశ్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తుతో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కొత్త పథకం అమలు కోసం ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతం చందాగా వసూలు చేస్తారు. అంతే మొత్తాన్ని, అంటే 1.5 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా జమ చేస్తుంది. ఈ విధానం ద్వారా ఉద్యోగుల నుంచి ఏడాదికి సుమారు రూ. 528 కోట్లు సమకూరుతాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కూడా దీనికి సమాన వాటా ఇస్తుండటంతో, వైద్య సేవలకు నిధుల కొరత లేకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నారు. పాత ఈహెచ్ఎస్ స్థానంలో రాబోయే ఈ స్కీమ్ మరింత సమర్థవంతంగా సేవలు అందిస్తుందని ఆశిస్తున్నారు.

# రష్యాలో వాట్సాప్ బ్లాక్




వాట్సాప్‌ను రష్యా నిషేధించింది. స్థానిక చట్టాలను పాటించేందుకు వాట్సాప్ మాతృసంస్థ మెటా నిరాకరించిందన్న కారణంతో పుతిన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అలాగే స్థానిక మెసెంజర్ 'మ్యాక్స్'కు మారాలని ప్రజలకు సూచించారు. 'మనకు మ్యాక్స్ ఒక ప్రత్యామ్నాయం. అది స్వదేశీ యాప్. ప్రస్తుతం అది మార్కెట్‌లో అందుబాటులో ఉంది' అని వెల్లడించారు. అయితే మ్యాక్స్‌పై రష్యాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం దానిని నిఘా సాధనంగా వాడుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆ వ్యాఖ్యలను రష్యా అధికారులు కొట్టిపారేశారు. ఇది ప్రజల దైనందిన కార్యకలాపాలు సులభతరంగా మారతాయని భరోసా ఇచ్చింది. కాగా.. స్థానిక చట్టాలను పాటించాలంటూ గత ఆరు నెలలుగా రష్యా ప్రభుత్వం వాట్సప్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది. రష్యాను మెటా ఇప్పటికే అతివాద సంస్థగా గుర్తించింది. దాంతో పుతిన్‌కు చిర్రెత్తుకొచ్చింది.

# ఫ్లిప్ కార్ట్ ఫుడ్ డెలివరీ?

ప్రముఖ ఈకామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ మరో కొత్త రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే మినిట్స్ పేరుతో క్విక్ కామర్స్ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ సంస్థ.. ఫుడ్ డెలివరీ విభాగంలోనూ సత్తా చాటేందుకు రెడీ అయ్యింది. ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి ఎంట్రీ ఇస్తున్నదన్న వార్తల నేపథ్యంలో.. ఇప్పటికే ఈ రంగంలో హవా నడిపిస్తున్న స్విగ్గీ, జొమాటోల షేర్‌లు గురువారం నష్టపోయాయి. కాగా, ఈ ఏడాది మే–జూన్ నెలల మధ్య బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు ఫ్లిప్‌కార్ట్ సన్నాహాలు చేస్తున్నట్లు 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ ఏడాది చివరినాటికి గానీ, వచ్చే ఏడాదికల్లా గానీ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు కంపెనీ ప్లాన్ చేస్తున్నట్లు పేర్కొంది. స్విగ్గీ, జొమాటో తరహాలో స్టాండ్ అలోన్ ప్లాట్‌ఫామ్‌ను నెలకొల్పాలా..? లేదా ప్రభుత్వ ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్ ఓఎన్‌డీసీలో బయ్యర్ సైడ్ అప్లికేషన్‌ను ఏర్పాటు చేయాలా..? అనే ఆప్షన్లను ప్రస్తుతం పరిశీలిస్తోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనిపై ఫ్లిప్‌కార్ట్ ఇంకా అధికారికంగా స్పందించలేదు.



## 2 తులాల తాళి చోరీ



జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): కుట్టుమిషన్‌తో జీవితాన్ని వెల్లదీస్తున్న ఓ మధ్యతరగతి మహిళ మెడలోంచి 2 తులాల మంగళసూత్రాన్ని దొంగలు కొట్టేశారు. వివరాల్లోకెళితే.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని అరవింద్‌నగర్‌కు చెందిన గట్ల శైలజ గురువారం సాయంత్రం ఊరికి వెళ్లేందుకు సిద్ధమైంది. అప్పుడే అటుగా బుల్లెట్‌పై వచ్చిన ఇద్దరు దొంగలు ఆమె మెడలోంచి మంగళసూత్రాన్ని తెంపుకొని, పరారయ్యారు. దీంతో బాధితురాలు కన్నీటిపర్యంతమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్‌లో జగిత్యాల యువకుని అనుమానాస్పద మృతి



జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో మార్కండేయ నగర్‌కు చెందిన చెట్‌పల్లి సంజయ్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ యువకుడు మియాపూర్ చెరువులో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడు. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసి రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరాడు. అయితే, గురువారం తెల్లవారేసరికి ఆ యువకుడు చెరువులో మృతదేహమై తేలాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు

## ఏపీలో సరికొత్త వైద్య సేవలు

అల్లూరి జిల్లా, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్ డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

## పవన్‌తో బాలకృష్ణ, నాగబాబు భేటీ

అమరావతి, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు వేర్వేరుగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు ప్రస్తుత పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఆ తర్వాత నాగబాబు కూడా సోదరుడిని కలిశారు. అంతకుముందు, శాసనసభలో మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. బాలకృష్ణ ఏదో చెబుతుండగా లోకేశ్ ఆసక్తిగా వింటున్నట్లు కనిపించింది. ఇదిలా ఉండగా, గిద్దలూరు నియోజకవర్గం సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

## బీఆర్‌ఎస్ హయాంలో అంతా చేదే

**ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం**

**త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ: కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని... కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్‌లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరించారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు.

### 15న నరసింహ స్వామి

# 32వ అఖండ జ్యోతి రథయాత్ర

**యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి**




హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15వ తేదీన బర్కత్ పుర లోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటి చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, గౌరవ సలహాదారుడు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు యం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్ కుమార్ తెలిపారు. గురువారం బర్కత్ పుర యాదాద్రి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అఖండ జ్యోతి రథయాత్ర ప్రచార పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ తేదీన ఆదివారం బర్కత్ పుర లో రథయాత్ర ప్రారంభమై 18వ తేదీన యాదగిరి గుట్టకు చేరుకుని అఖండ జ్యోతిని ఆలయంలో అందించడం జరుగుతుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్ పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్మెట్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్, 16న ఉప్పల్, ఫిర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్, 17న ఘట్కేసర్, కొండమడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి, 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుంటుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహ్మా మూర్తి, ఆలయ ఈవో జె.భవాని శంకర్, నగరిగారి ప్రీతమ్ కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, రథసారధి ఎ.గణపతి, ఎ. అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బొత్స వర్సెస్ పార్థసారథి

**సవాళ్లు, ప్రతిసవాళ్లు**

**ఏపీ మండలిలో మాటల యుద్ధం**

**సంక్షేమ పథకాలపై తీవ్ర వాగ్వాదం**





అమరావతి, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు. అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు. ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి రిమాండ్

**గుంటూరు కోర్టు ఆదేశాలతో**

**రాజమండ్రి జైలుకు తరలింపు**




రాజమండ్రి, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో రిమాండ్ పడింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కేసులో గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో, 2023 జనవరిలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో బెయిల్ లభించగా, గతేడాది మెడికల్ కాలేజీ అంశంపై నిర్వహించిన ఆందోళనల్లో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న కేసులోనూ ఆయనకు బెయిల్ లభించింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ రావడంతో అంబటి విడుదల కావడం లాంఛనమేనని అందరూ అనుకున్నారు. అయితే, పోలీసులు సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ పై కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అంబటికి నిరాశే మిగిలింది. తాజా రిమాండ్‌తో ఆయన విడుదల ఆగిపోయింది.

# కిలో హెరిటేజ్ నెయ్యి 658?

**నాడు రూ.278కే సరఫరా ఎలా?**

**టీటీడీ మాజీ చైర్మన్ భూమన ప్రశ్నలు**




తిరుపతి, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి ధర, నాణ్యత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు. గతంలో 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తయారీ యూనిట్ అయిన ఇందాపూర్ ఫుడ్స్ అండ్ డెయిరీ ప్రొడక్ట్స్.. టీటీడీకి కేజీ నెయ్యిని రూ. 278 నుంచి రూ. 306 ధరలకే సరఫరా చేసిందని భూమన గుర్తుచేశారు. రూ. 300 లోపు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందని ఇప్పుడు ప్రశ్నిస్తున్న చంద్రబాబు, ఆనాడు సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆశ్చర్యకరంగా, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే యూనిట్ సరఫరాదారుగా వచ్చి, ఇప్పుడు కేజీ నెయ్యిని ఏకంగా రూ. 658కి సరఫరా చేస్తోందని భూమన ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెరిటేజ్ తయారీ యూనిట్, కర్ణాటకకు చెందిన మరో సంస్థతో కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు. గతంలో రూ. 278కి సరఫరా చేసినప్పుడు నాణ్యమైనదిగా భావించి, ఇప్పుడు ధరను రూ. 658కి ఎలా పెంచారని.. దీని వెనుక ఏదైనా వ్యాపార ఒప్పందం ఉందా అని సీఎం సమాధానం చెప్పాలని భూమన నిలదీశారు. గతంలో చంద్రబాబు హయాంలో ఈ రెండు యూనిట్లు 40 లక్షల కేజీలకు పైగా నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని భూమన డిమాండ్ చేశారు.

## పుష్ప స్టైల్లో 'తగ్గేదేలే' అన్న అంబటి

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు అంబటి రాంబాబును పోలీసులు పీటీ వారెంట్‌పై రాజమండ్రి నుంచి గుంటూరు కోర్టుకు తరలించారు. సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల లక్కీ డ్రా టిక్కెట్ల అవినీతి కేసులో విచారణ కోసం కోర్టులో హాజరుపరిచారు. పోలీసు వ్యాన్ గుంటూరు కోర్టు ప్రాంగణానికి చేరుకున్న తర్వాత వాహనం దిగడానికి ముందు అంబటి రాంబాబు పుష్ప స్టైల్లో 'తగ్గేదేలే' అంటూ స్పందించారు. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ లా అంబటి రాంబాబు కూడా వ్యాన్‌లో సీటు మీద కూర్చుని గెడ్డం కింద చేయిని స్టైల్‌గా పెట్టి 'తగ్గేదేలే' అనే స్టైల్లో రియాక్షన్ ఇచ్చారు. ఆయనను కోర్టుకు తీసుకువస్తున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి రాంబాబు గత నెల 31వ తేదీ నుంచి రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్నారు. ఇప్పటికే రెండు కేసుల్లో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. దీంతో సత్తెనపల్లి పోలీసులు గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు.

## కాకాణికి నోటీసులు

నెల్లూరు, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): గత కొన్ని రోజులుగా వైసీపీ నేతలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల అరెస్టులు, రిమాండ్లు అందరికీ తెలిసిందే. ఇప్పుడు మరో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంతు వచ్చింది. ఆయనకు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుమ్మలదిన్నెలో బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని, ఈ నెల 14న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. నోటీసులపై కాకాణి ఇంకా స్పందించాల్సి ఉంది. మరోవైపు, నెల్లూరు జిల్లాలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో కాకాణి ఇప్పటికే జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. బెయిల్ పై బయటకు వచ్చినప్పటి నుంచి ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత పెంచారు.

## 18 లక్షల టన్నుల ధాన్యం తీసుకోండి

**కేంద్రానికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతులు**

న్యూఢిల్లీ: వానాకాలం పంటకు (2025–26 సీజన్) సంబంధించి తాము అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. వానా కాలం పంటకు సంబంధించి 53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్ఎంటీ) అనుమతించారని.. కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో అదనంగా 18 ఎల్ఎంటీలు తాము సేకరించినందున ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్ సీఐ సేకరించాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. 2024–25 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి జోషిని సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. 2024–25 వానా కాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు నిర్దేశించారని, దానిని మరో రెండు నెలలు పాటు పొడిగించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 2014–15 వానా కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం, రాష్ట్ర మంత్రి కోరారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. నాడు సేకరణకు తాము రుణం తీసుకున్నామని.. దానికి వడ్డీ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగిందని తెలియజేశారు. అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు.

# చూపు కోల్పోతున్న ఇమ్రాన్ ఖాన్

**కుడి కంటికి 85 శాతం చూపు నష్టం.. అధికారుల నిర్లక్ష్యం వల్లే సమస్య.. వైద్య పరీక్షలకు పాక్ సుప్రీం ఆదేశం**



ఇస్లామాబాద్: పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్న ఆయన తన కుడి కంటిలో 85 శాతం చూపు కోల్పోయినట్లు వెల్లడైంది. ఈ విషయంపై స్పందించిన పాక్ సుప్రీంకోర్టు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు) బారిస్టర్ సల్మాన్ సఫ్దర్, జైల్లో ఇమ్రాన్ ఖాన్‌ను కలిసిన తర్వాత ఈ వివరాలను నివేదిక రూపంలో కోర్టుకు సమర్పించారు. తన కుడి కంటి చూపు కేవలం 15 శాతానికే పరిమితమైందని ఇమ్రాన్ స్వయంగా చెప్పినట్లు నివేదికలో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం వరకు బాగానే ఉన్న కన్ను, ఆ తర్వాత మసకబారడం మొదలైందని, ఈ విషయాన్ని జైలు అధికారులకు తెలిపినా వారు పట్టించుకోలేదని ఆయన వివరించారు. వైద్య పరిభాషలో 'రైట్ సెంట్రల్ రెటినల్ వీన్ ఆక్లూజన్' (రక్తనాళంలో అడ్డంకి) కారణంగా కంటి చూపు దెబ్బతిన్నట్లు తేలింది. అక్టోబర్ 2025 వరకు ఇమ్రాన్ కంటి చూపు సాధారణంగానే ఉందని, సరైన సమయంలో చికిత్స అందించకపోవడం వల్లే పరిస్థితి విషమించిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రెండున్నరేళ్లుగా ఆయన్ను ఏకాంత గదిలో ఉంచడం కూడా ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిందని నివేదికలో తెలిపారు. ఈ నివేదికను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యాహ్యా అఫ్రిదీ నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఫిబ్రవరి 16వ తేదీలోగా స్పెషలిస్ట్ వైద్యులతో మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయన వ్యక్తిగత వైద్యుడిని సంప్రదించేందుకు, కుమారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అనుమతించాలని కూడా ఆదేశించింది. ఈ పరిణామం పాకిస్థాన్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుండగా, ఇమ్రాన్ త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## 44 వేల అక్రెడిటేషన్ కార్డులిస్తాం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఈవార్తలు): రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రెడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రెడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్వో మల్సూర్‌తో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అక్రెడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జీవో 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జీవో 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రెడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. గతంలో 23 వేల మందికి మాత్రమే అక్రెడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు. 2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు, 25,001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15,001 నుంచి 25,000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661, 15 వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్స్‌కు 624, 20 న్యూస్ ఏజెన్సీలకు 68 అక్రెడిటేషన్‌లు అందుతాయని తెలిపారు. 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ, మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అక్రెడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు.

# చూద్దాం.. ఏం జరుగుతుందో!

**బంగ్లాదేశ్ ఎన్నికలపై భారత్ సైలెన్స్.. ఎన్నికల పరిశీలకులను పంపాలన్న ఆహ్వానం తిరస్కరణ**



న్యూఢిల్లీ/ఢాకా: గురువారం నాడు బంగ్లాదేశ్‌లో 13వ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న వేళ, భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాకే అక్కడి రాజకీయాలపై ఒక అంచనాకు వస్తామని, ప్రజా తీర్పు కోసం వేచి చూస్తామని తెలిపింది. న్యూఢిల్లీలో నేడు జరిగిన మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. "బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎలాంటి తీర్పు వస్తుందో చూసేందుకు ఫలితాల కోసం వేచి ఉండాలి. ఆ తర్వాతే మిగతా అంశాలను పరిశీలిస్తాం" అని ఆయన అన్నారు. బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలు జరగాలన్నదే తమ అభిమతమని పునరుద్ఘాటించారు. ఎన్నికల పరిశీలకులను పంపాలని బంగ్లాదేశ్ నుంచి ఆహ్వానం అందినప్పటికీ, తాము ఎవరినీ పంపలేదని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, గురువారం పోలింగ్ జరుగుతున్న సమయంలో బంగ్లాదేశ్‌లోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఒక రాజకీయ నేత మరణించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఖుల్నా జిల్లాలోని అలియా మదరసా పోలింగ్ కేంద్రం వద్ద బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత మొహిబుజ్జమాన్ కోచీ మరణించారు. బీఎన్‌పీ, జమాత్-ఏ-ఇస్లామీ మద్దతుదారుల మధ్య ఉద్రిక్తత తలెత్తడంతో ఈ ఘటన జరిగింది. జమాత్ మద్దతుదారుడొకరు తోసేయడంతో కోచీ చెట్టుకు తల తగిలి మరణించారని బీఎన్‌పీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను పోలీసులు ధృవీకరించారు. కోచి ఆసుపత్రికి తీసుకువచ్చేసరికే మరణించారని వైద్యులు తెలిపారు. మరోవైపు, గోపాల్‌గంజ్ జిల్లాలోని ఒక పోలింగ్ కేంద్రంపై దుండగులు కాక్‌టెయిల్ బాంబులతో దాడి చేయగా, ముగ్గురు గాయపడ్డారు. తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలు, హింసాత్మక వాతావరణం మధ్య బంగ్లాదేశ్‌లో ఈ కీలక ఎన్నికలు జరుగుతుండగా, ఎన్నికల నిష్పాక్షికతపై పలు పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఇంటెల్‌పై సీసీఐ కొరడా

**27.38 కోట్లు జరిమానా..**

**వారెంటీ పాలసీపై చర్యలు**

న్యూఢిల్లీ: ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ కార్పొరేషన్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) భారీ జరిమానా విధించింది. బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల విషయంలో భారత్‌కు మాత్రమే ప్రత్యేకంగా అమలు చేసిన వారెంటీ పాలసీ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో, రూ.27.38 కోట్ల ఫైన్ వేసింది. మ్యాట్రిక్స్ ఇన్ఫో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన ఫిర్యాదుతో ఈ కేసు విచారణకు వచ్చింది. ఇంటెల్ 2016 ఏప్రిల్ 25 నుంచి భారత్‌లో కొత్త వారెంటీ పాలసీని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, ఇంటెల్ అధీకృత భారతీయ డిస్ట్రిబ్యూటర్ల నుంచి కొనుగోలు చేసిన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్లకు మాత్రమే ఇక్కడ వారెంటీ వర్తిస్తుంది. ఇతర దేశాల్లో కొన్న ప్రాసెసర్లకు భారత్‌లో వారెంటీ లభించదు. ఈ విధానంపై విచారణ జరిపిన సీసీఐ, డెస్క్‌టాప్‌ల కోసం ఉద్దేశించిన బాక్స్‌డ్ మైక్రోప్రాసెసర్ల మార్కెట్‌లో ఇంటెల్ ఆధిపత్య స్థానంలో ఉందని నిర్ధారించింది. చైనా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల్లోని వారెంటీ పాలసీలతో పోలిస్తే, భారత్‌లో అమలు చేసిన విధానం వివక్షాపూరితంగా ఉందని అభిప్రాయపడింది. ఇది వినియోగదారుల ఎంపిక స్వేచ్ఛను పరిమితం చేయడంతో పాటు, ప్యారలల్ ఇంపోర్టర్లకు నష్టం కలిగించిందని పేర్కొంది. ఇది కాంపిటీషన్ యాక్ట్, 2002లోని సెక్షన్ 4ను ఉల్లంఘించడమేనని తేల్చింది. ఈ వివాదాస్పద పాలసీ ఎనిమిదేళ్ల పాటు అమల్లో ఉన్నందున, సంబంధిత టర్నోవర్‌పై 8 శాతం జరిమానా విధించాలని మొదట సీసీఐ భావించింది. అయితే, 2024 ఏప్రిల్ 1 నుంచి ఇంటెల్ ఈ పాలసీని స్వచ్ఛందంగా నిలిపివేయడం వంటి సానుకూల అంశాలను పరిగణనలోకి తీసుకుని, జరిమానా మొత్తాన్ని రూ.27.38 కోట్లకు తగ్గించింది. వివాదాస్పద వారెంటీ పాలసీని ఉపసంహరించుకున్న విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని, దీనిపై నివేదిక సమర్పించాలని ఇంటెల్‌ను సీసీఐ ఆదేశించింది.


## ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం



జెనీవా: పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థపై ఐక్యరాజ్యసమితి (యూఎన్) సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన ఉగ్రదాడి వెనుక జైషే హస్తం ఉందని, ఆ సంస్థ మహిళలతో ప్రత్యేకంగా ఒక ఉగ్రవాద విభాగాన్ని కూడా ఏర్పాటు చేసిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఐరాస భద్రతా మండలికి చెందిన ఆల్-ఖైదా, ఐసిస్ ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. 2025 నవంబర్ 9న ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన దాడిలో 15 మంది మరణించారని, ఈ ఘటనతో జైషే మహమ్మద్‌కు సంబంధం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని పేర్కొంది. ఈ దాడితో పాటు మరికొన్ని దాడులకు జైషే బాధ్యత వహించినట్లు ఒక సభ్య దేశం తెలిపినట్లు నివేదికలో పొందుపరిచారు. అంతేకాకుండా జైషే చీఫ్, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ 2025 అక్టోబర్ 8న 'జమాత్ ఉల్-ముమినత్' పేరుతో మహిళా విభాగాన్ని అధికారికంగా ప్రకటించినట్లు నివేదిక తెలిపింది. ఉగ్రవాద దాడులకు మద్దతు ఇవ్వడమే లక్ష్యంగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అయితే, ఈ నివేదికలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఒక సభ్య దేశం (పాకిస్థాన్ అని భావిస్తున్నారు) మాత్రం జైషే సంస్థ ఎప్పుడో 'నిర్వీర్యం' అయిపోయిందని వాదించింది. నివేదికలో జైషే ప్రస్తావనపై పాకిస్థాన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం.

## మూడో తరగతి నుంచే ఏఐ

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి**



న్యూఢిల్లీ: కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

# స్పీకర్ చాంబర్‌లో విపక్ష ఎంపీల రగడ


**వీడియో రిలీజ్ చేసిన కిరణ్ రిజిజు**



న్యూఢిల్లీ: పార్లమెంట్ లో కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీల ప్రవర్తనపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నెల 4న లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీల రగడ అందరూ చూశారని అన్నారు. ఆ తర్వాత స్పీకర్ ఓం బిర్లా ఛాంబర్ లోకి దూసుకెళ్లి మరీ ఆయనను, ప్రధాని మోదీని కాంగ్రెస్ ఎంపీలు దుర్భాషలాడారని ఆరోపించారు. సభలో విపక్ష ఎంపీలు చేసిన రగడకు సంబంధించిన వీడియోను ఇప్పటికే రిలీజ్ చేసిన కేంద్ర మంత్రి.. తాజాగా స్పీకర్ ఛాంబర్ లో జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను ఈ రోజు ఉదయం ఎక్స్ లో పోస్ట్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చేపట్టిన చర్చలో ప్రధాని మోదీని చుట్టుముట్టే ప్రయత్నం జరిగిందని స్పీకర్ ఓం బిర్లా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై విశ్వసనీయ సమాచారం అందడంతో ప్రధాని మోదీని సభకు రావొద్దని తానే సూచించినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు లోక్ సభలో తీవ్ర ఆందోళన చేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్ లోకి దూసుకెళ్లి అక్కడ కూడా గందరగోళం సృష్టించారు. కిరణ్ రిజిజు షేర్ చేసిన తాజా వీడియోలో.. స్పీకర్ ఓం బిర్లా ఛాంబర్ లోపల పెద్ద సంఖ్యలో ఎంపీలు గట్టిగా మాట్లాడటం కనిపిస్తోంది. కిరణ్ రిజిజు సహా పలువురు కేంద్ర మంత్రులు, పలువురు బీజేపీ ఎంపీలు మరో పక్క నిల్చుని ఉండడం చూడొచ్చు. స్పీకర్ ఛాంబర్ లో జరిగిన ఉదంతానికి సంబంధించిన వీడియోను షేర్ చేస్తూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ఛాంబర్ లో ఆయన అనుమతి లేకుండా వీడియో తీయడం చట్టవిరుద్ధమని, ఈ వీడియోను కాంగ్రెస్ ఎంపీ ఒకరు తీశారని కేంద్ర మంత్రి చెప్పారు. దాదాపు 20 నుంచి 25 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్ లో గట్టిగా మాట్లాడుతుండటం ఈ వీడియోలో చూడొచ్చని అన్నారు. స్పీకర్ ను దుర్భాషలాడటంతో పాటు ప్రధాని మోదీపై బెదిరింపు వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఎంపీలు ఇలా బెదిరింపులకు పాల్పడటాన్ని తాము ఎప్పటికీ ప్రోత్సహించబోమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ పోస్టులో పేర్కొన్నారు.

## దూరదర్శన్ తొలితరం న్యూస్ రీడర్ సరళా మహేశ్వరి కన్నుమూత

న్యూఢిల్లీ: భారత టెలివిజన్ రంగంలో సుపరిచితమైన ముఖం, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. "దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వరికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు. "సరళా సౌజన్యానికి, మర్యాదకు ప్రతిరూపం. అపారమైన భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తి" అని ఆయన పేర్కొన్నారు. ఆమె మృతితో టెలివిజన్ జర్నలిజంలో ఒక స్వర్ణయుగం ముగిసిందని మహిళా కాంగ్రెస్ అభివర్ణించింది. ఢిల్లీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో, 1976లో సరళా మహేశ్వరి దూరదర్శన్‌లో న్యూస్ అనౌన్సర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. భారత టెలివిజన్ రంగంలో లైవ్‌లో వార్తలు చదివిన తొలితరం యాంకర్లలో ఆమె ఒకరు. 1984 వరకు డీడీలో పనిచేసి, ఆ తర్వాత యూకే వెళ్లి 1986 వరకు బీబీసీలో న్యూస్ రీడర్‌గా సేవలందించారు. 1988లో తిరిగి భారత్‌కు వచ్చి మళ్లీ దూరదర్శన్‌లో చేరారు. బ్లాక్ అండ్ వైట్, తొలితరం కలర్ టీవీల కాలంలో తన ప్రశాంతమైన, హుందా శైలితో ఆమె ప్రతి ఇంట్లోనూ సుపరిచితమైన, విశ్వసనీయమైన యాంకర్‌గా నిలిచారు.




## నరవణె బుక్ రాహుల్ చేతికెలా?

**బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే నిలదీత**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ లోక్ సభ సభ్యుడు రాహుల్ గాంధీని అనర్హుడిగా ప్రకటించాలని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈ మేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ ఆయన నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాహుల్ గాంధీకి నిధులు ఎవరు ఇస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని ఎంఎం నరవణె పుస్తకం ఎలా వచ్చింది? అనేది వెల్లడి కావాల్సి ఉందని అన్నారు. భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి నోటీసులో ప్రస్తావించినట్లు తెలిపారు. లోక్ సభలో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన అన్నారు. రక్షణ, ఆర్థిక, వాణిజ్యం, విదేశాంగ వ్యవహారాలు ఇలా ఏదైనా కావొచ్చు కానీ ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంతో లక్ష్యంగా చేసుకోవడం రాహుల్ గాంధీకి ఇది మొదటిసారి కాదని అన్నారు. కానీ పార్లమెంటు, ఇతర ప్రజా వేదికలలో నిరాధారమైన, అనైతిక అంశాలను లేవనెత్తడం ద్వారా ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి సోరోస్ ఫౌండేషన్ అండగా ఉందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ దేశాన్ని అంతర్గతంగా దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాగా, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె రాసిన ప్రచురించబడని పుస్తకంపై పార్లమెంటులో తీవ్ర వాగ్వాదం నడిచిన విషయం తెలిసిందే.

## ఖాకీనే ఫోన్ దొంగ

**యూపీలో కానిస్టేబుల్ చేతివాటం**



లక్నో: దొంగలను పట్టుకుని చట్టం ముందు నిలబెట్టాల్సిన ఓ కానిస్టేబుల్ తానే దొంగతనం చేశాడు. మరో కానిస్టేబుల్ తో కలిసి ఖరీదైన ఫోన్ ను కొట్టేశాడు. మొబైల్ కొనడానికి వెళ్లి షాపులో చేతివాటం ప్రదర్శించాడు. ఉత్తరప్రదేశ్ లోని జౌన్ పూర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జౌన్ పూర్ కు చెందిన కానిస్టేబుళ్లు ధనంజయ్ బింద్, మిథిలేశ్ యాదవ్ ఈ నెల 7న జేసీ ఇంటర్ సెక్షన్ ఏరియాలోని ఓ మొబైల్ షాప్ కు వెళ్లారు. కొత్త ఐఫోన్ కొనుగోలు చేసేందుకు వచ్చామని చెప్పడంతో షాపులోని యువతి వారికి వివిధ మోడల్స్ చూపించింది. దాదాపు 20 నిమిషాలపాటు ఆ ఫోన్లను పరిశీలించిన ధనంజయ్, మిథిలేశ్.. చివరకు ఏదీ నచ్చలేదని వెళ్లిపోయారు. అయితే, ఫోన్లను పరిశీలిస్తున్నప్పుడే ఇద్దరిలో ఒకరు చాలా నేర్పుగా ఐఫోన్ ప్రో మ్యాక్స్ ను తన జేబులో పెట్టేసుకున్నాడు. దాదాపు రూ.1.60 లక్షలు విలువ చేసే ఫోన్ ను కాజేశాడు. తన చేతివాటం వెంటనే బయటపడకుండా ఉండేందుకు తన పాత ఐఫోన్ ను అక్కడి కొత్త ఫోన్లలో కలిపేశాడు. కౌంటర్ ముందు ల్యాప్ టాప్ అడ్డుగా ఉండడంతో షాపులో యువతి ఇది గుర్తించలేదు. ఆ తర్వాత ఐఫోన్ ప్రో మ్యాక్స్ ఫోన్ పోయిందని గుర్తించిన షాపు యజమాని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా కానిస్టేబుళ్ల నిర్వాకం బయటపడింది. దీంతో ఆ వీడియోను వాట్సాప్ గ్రూపులో షేర్ చేయడంతో పాటు సిటీ కమిషనర్ కు నేరుగా ఫిర్యాదు చేశాడు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించిన ఎస్పీ.. కానిస్టేబుళ్ల వద్ద నుంచి ఫోన్ రికవరీ చేయడంతో పాటు వారిని సస్పెండ్ చేశారు.

## పార్లమెంటులో గుద్దుకున్నారు!

**టర్కీ పార్లమెంటులో రణరంగం**

ఇస్తాంబుల్: టర్కీ (తుర్కియే) పార్లమెంటు రణరంగాన్ని తలపించింది. కొత్తగా న్యాయశాఖ మంత్రి నియామకం తీవ్ర వివాదానికి దారితీయడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. ఎంపీలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకుంటూ, తోపులాటకు దిగడంతో సభలో బుధవారం తీవ్ర గందరగోళం నెలకొంది. అధ్యక్షుడు ఎర్డోగాన్ ఇటీవల క్యాబినెట్‌లో మార్పులు చేసి, వివాదాస్పద అధికారి అయిన అకిన్ గుర్లెక్‌ను కొత్తగా న్యాయశాఖ మంత్రిగా నియమించారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసేందుకు పోడియం వద్దకు వస్తుండగా ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికార ఏకే పార్టీ సభ్యులు వారిని నిలువరించబోగా, ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాట, ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. ఘర్షణల నేపథ్యంలో పార్లమెంట్ స్పీకర్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. విరామం అనంతరం, అధికార పార్టీ ఎంపీలు గుర్లెక్‌కు రక్షణగా నిలబడగా ఆయన ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. గతంలో ఇస్తాంబుల్ చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన గుర్లెక్ ప్రతిపక్ష నేతలపై, ముఖ్యంగా ఇస్తాంబుల్ మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లుపై రాజకీయ ప్రేరేపిత కేసులు పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇమామోగ్లుపై 142 అభియోగాలు మోపి, 2,000 ఏళ్లకు పైగా జైలు శిక్ష విధించాలని కోరడం వెనుక గుర్లెక్ ఉన్నారని వారు విమర్శిస్తున్నారు. అలాంటి వ్యక్తికి న్యాయశాఖ మంత్రి పదవి ఇవ్వడం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు.

లవ్లీ చిత్రం



విశ్వ అగర్వాల్

# సౌత్ ఫిలింఫేర్ నామినేషన్లలో తెలుగు సినిమాలు




చిత్ర పరిశ్రమలో నటీనటుల ప్రతిభను గుర్తిస్తూ ప్రతిష్టాత్మకంగా అందించే ఫిలింఫేర్ అవార్డ్స్‌కు సినీ ప్రియుల్లో ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రతి ఏడాది ఈ అవార్డుల కోసం ప్రేక్షకులు, సినీ తారలు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇదే క్రమంలో 2026 సంవత్సరానికి గాను 70వ సౌత్ ఫిలింఫేర్ అవార్డ్స్ నామినేషన్ల జాబితా తాజాగా విడుదలైంది. ఈ జాబితాలో తెలుగు సినిమాలు గణనీయంగా స్థానం సంపాదించడంతో టాలీవుడ్ మరోసారి తన సత్తాను చాటుకుంది. ఫిలింఫేర్ అవార్డుల వేడుకను ఈ నెల ఫిబ్రవరి 21న ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ అవార్డ్స్ కార్యక్రమం దక్షిణాది చిత్ర పరిశ్రమకు సంబంధించిన అత్యంత ప్రతిష్టాత్మక ఈవెంట్లలో ఒకటిగా భావిస్తారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ భాషల చిత్రాలు వివిధ విభాగాల్లో పోటీపడుతున్నాయి. ప్రత్యేకంగా 2024లో విడుదలైన సినిమాలను పరిశీలించి ఈ ఏడాది అవార్డుల కోసం ఎంపిక చేశారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ దర్శకుడు, సంగీతం, ఛాయాగ్రహణం వంటి పలు విభాగాల్లో నామినేషన్లు ప్రకటించారు. ఇందులో తెలుగు చిత్రాలకు మంచి ప్రాధాన్యం లభించడం విశేషం.

**ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ కోసం పోటీ పడుతున్న తెలుగు చిత్రాల జాబితా..**

**ఉత్తమ చిత్రం..**

1.35 చిన్న కథ కాదు
2.కమిటీ కుర్రోళ్లు
3.హనుమాన్
4.కల్కి 2898 ఏడీ
5.లక్కీ భాస్కర్
6.పుష్ప : ది రూల్




**ఉత్తమ దర్శకుడు ..**

1.నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ)
2.నంద కిశోర్ (35 చిన్న కథ కాదు)
3.ప్రశాంత్ వర్మ (హనుమాన్)
4.సుకుమార్ (పుష్ప : ది రూల్)
5.వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్)
6.యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)

**ఉత్తమ నటుడు..**

1 అల్లు అర్జున్ (పుష్ప : ది రూల్)
2.దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
3.ఎన్టీఆర్ (దేవర)
4.నాని (సరిపోదా శనివారం)
5.సిద్ధూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్)
6.తేజ సజ్జ (హనుమాన్)

**ఉత్తమ నటి..**

1.అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్)
2.ఆషికా రంగనాథ్ (నా సామిరంగ)
3.మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్)
4.నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
5.ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం)
6.రష్మిక (పుష్ప : ది రూల్)

**ఉత్తమ సహాయ నటుడు..**


1.అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)
2.ఫహద్ ఫాజిల్ (పుష్ప : ది రూల్)
3.సత్య (మత్తు వదలరా 2)
4.ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
5.వినయ్ రాయ్ (హనుమాన్)

**ఉత్తమ సహాయ నటి..**

1.అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
2.ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2)
3.రషి సింగ్ నందు (ప్రసన్నవదనం)
4.శరణ్య ప్రదీప్ (అంబాజీపేట బ్యాండు)
5.శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ)
6.వరలక్ష్మి శరత్‌కుమార్ (హనుమాన్)







## ఆసక్తికరంగా సుహాస్ హే భగవాన్ ట్రైలర్

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా



నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

## మార్చి 22న 'జై హనుమాన్' లాంచ్?

తెలుగులోనే కాక ఇతర భాషల్లోనూ హనుమాన్ చిత్రానికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఏకంగా రూ.300 కోట్ల వసూళ్ల క్లబ్బులోకి కూడా అడుగు పెట్టింది. దీంతో చివర్లో లీడ్ ఇచ్చిన 'జై హనుమాన్' మీద భారీగా అంచనాలు పెరిగిపోయాయి. కానీ 'హనుమాన్' తర్వాత ఏవేవో ప్రాజెక్టులను లైన్లో పెట్టి.. ఏదీ ముందుకు కదలక రెండేళ్ల సమయాన్ని వృథా చేసుకున్నాడు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఐతే ఈ మధ్యే అన్నీ పక్కన పెట్టి 'జై హనుమాన్'ను పట్టాలెక్కించడానికి అతను సన్నాహాలు మొదలుపెట్టాడు. అవి ఒక కొలిక్కి వచ్చాయి. ఎట్టకేలకు సినిమా సెట్స్ మీదికి వెళ్లబోతోంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం కూడా కుదిరిందన్నది తాజా సమాచారం. మార్చి 22న పుణ్యక్షేత్రం అయిన హంపిలో 'జై హనుమాన్' లాంచ్ ఘనంగా చేయబోతున్నారట. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్రను కన్నడ స్టార్ రిషబ్ శెట్టి పోషించనున్నారు. హంపి రిషబ్ సొంత రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం. అది తెలుగు వారికి కూడా ప్రత్యేకమే.



## 3 నెలల్లోనే షూటింగ్ కంప్లీట్

మెగా కోడలు లావణ్య త్రిపాఠి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్.. టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ మూవీ ప్రమోషనల్ ఈవెంట్‌లో మార్చి 6న సినిమాను రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈవెంట్‌లో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ.. ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు నేను ప్రెగ్నెంట్‌ని. కేవలం 3 నెలల్లోనే షూటింగ్ పూర్తి చేశాను. దర్శకనిర్మాతల సపోర్ట్ వల్లే షూటింగ్ చేయగలిగాను. సప్తగిరితో పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో దేవ్ మోహన్ నటన అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. ఎంటర్‌టైనింగ్‌గా సాగే చిత్రం సతీలీలావతి. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని.. మార్చి 6న సినిమాను చూసి పెద్ద హిట్ చేస్తారని కోరుకుంటున్నానంది లావణ్య త్రిపాఠి. కమల్ హాసన్ నటించిన సతీ లీలావతితో నా సినిమాను పోల్చనని డైరెక్టర్ తాతినేని సత్య అన్నాడు. అందరూ రిలేట్ అయ్యేలా.. అందరికీ కనెక్ట్ అయ్యేలా సినిమా తీశామని.. మార్చి 6న మూవీని చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని ధీమా వ్యక్తం చేశాడు. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

## నా లవ్‌కు వాడే కట్టప్ప

టాలీవుడ్ మెగా హీరో సాయి ధరమ్ తేజ్ ఎప్పుడూ చాలా సరదాగా ఉంటారు. స్టేజ్ మీద ఉన్నది తన ఫ్రెండ్స్ అయితే చాలు, అస్సలు మొహమాటం లేకుండా పాత విషయాలన్నీ బయట పెట్టేస్తుంటారు. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటిస్తున్న 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు గెస్టులుగా వచ్చిన సాయి ధరమ్ తేజ్, దర్శకుడు రామ్ అబ్బరాజు మధ్య జరిగిన ఒక ఫన్నీ కాన్వర్జేషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతాన్ని తవ్వుకుంటూ వీరిద్దరూ చేసిన రచ్చ ఈవెంట్‌కే హైలైట్‌గా నిలిచింది. తన లవ్ స్టోరీ బ్రేకప్ అవ్వడానికి కారణం దర్శకుడు రామ్ అబ్బరాజే అని సాయి ధరమ్ తేజ్ స్టేజ్ మీద అందరి ముందు లీక్ చేసేశారు. 'నేను ప్రేమించిన అమ్మాయికి మన భాష రాదు, నాకు ఆమె భాష రాదు.. ఈ రామ్ గాడు మధ్యలో దూరి ఏదో చెప్పి మొత్తానికి నా లవ్ స్టోరీని బ్రేకప్ చేయించాడు' అంటూ తేజ్ సరదాగా ఆరోపించారు. వాలెంటైన్స్ డే దగ్గర పడుతున్న టైమ్‌లో మెగా హీరో నోటి నుంచి ఈ బ్రేకప్ సీక్రెట్ రావడంతో అక్కడున్న వారంతా షాక్ అయ్యారు. 'వీడు నా లవ్ స్టోరీకి ప్రత్యక్ష సాక్షి మాత్రమే కాదు, దాన్ని క్లోజ్ చేయించిన కట్టప్ప కూడా వీడే' అని తేజ్ అనడంతో ఈవెంట్‌లో అందరూ నవ్వేశారు. దీనికి రామ్ అబ్బరాజు స్పందిస్తూ.. ఆ గొడవలో తన ప్రమేయం లేదని, కేవలం అసిస్టెంట్ డైరెక్టర్‌గా మాత్రమే అక్కడ ఉన్నానని కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు.



## బయటకు రా చూపిస్తా: విశ్వక్‌సేన్

సాధారణంగా విశ్వక్‌సేన్ సినిమా వస్తుందంటే ఒక రకమైన బజ్ ఉంటుంది. కానీ ఈ మధ్య కాలంలో ఆయనకు సరైన హిట్ పడలేదు. దీంతో ఫంకీ సినిమా రిజల్ట్ విశ్వక్ కెరీర్‌కు చాలా ఇంపార్టెంట్ గా మారింది. అటు దర్శకుడు అనుదీప్ కె.వి పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది. వీరిద్దరి కాంబినేషన్ అనౌన్స్ చేసినప్పుడు ఒక రేంజ్ అంచనాలు ఉన్నా, ప్రస్తుతం మార్కెట్‌లో ఈ మూవీపై బజ్ ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా గెలవాలంటే పక్కాగా పాజిటివ్ టాక్ రావాల్సిందే. ఇక ప్రెస్ మీట్‌లో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నలకు విశ్వక్ సేన్ తనదైన స్టైల్‌లో సమాధానం ఇచ్చారు. 'మీలో ఆ పాత అగ్రెషన్, కోపం, యాటిట్యూడ్ ఇప్పుడు కనిపించడం లేదు, ఏమైంది?' అని అడిగినప్పుడు విశ్వక్ నవ్వుతూ రియాక్ట్ అయ్యారు. 'కోపం బయట ఉంటుంది, బయటకు రా చూపిస్తా' అంటూ సరదాగా కౌంటర్ ఇచ్చారు. ఈ మాటలు వినగానే పక్కనే ఉన్న హీరోయిన్ సంయుక్త మేనన్, ఇతర టీమ్ మెంబర్స్ నవ్వు ఆపుకోలేకపోయారు.







# పసికూనపై పంజా

## కుమ్మేసిన టీమిండియా..

### నమీబియాపై ఆల్ రౌండ్ షో.. 93 పరుగుల భారీ విజయం

### చెలరేగిన ఇషాన్ , పాండ్యా, వరుణ్

టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో నమీబియాపై 93 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమగ్ర ప్రదర్శన కనబరిచిన భారత్, ప్రత్యర్థిని చిత్తుగా ఓడించింది. 210 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు నమీబియా బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కేవలం 7 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి నమీబియా పతనాన్ని శాసించాడు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీయడంతో నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. అంతకుముందు, ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన నమీబియా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ ఇషాన్ కిషన్ (24 బంతుల్లో 61; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) విధ్వంసకర ఆరంభాన్ని ఇచ్చాడు. అతనికి సంజూ శాంసన్ (8 బంతుల్లో 22) కూడా తోడవడంతో పవర్‌ప్లేలోనే భారత్ స్కోరు పరుగులు పెట్టింది. మధ్యలో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ నెమ్మదిగా ఆడినా, చివర్లో హార్దిక్ పాండ్యా (28 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. నమీబియా బౌలర్లలో కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్ 20 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. ఈ టోర్నీలో భారత్ కు ఇది వరుసగా రెండో విజయం. తొలి మ్యాచ్ లో భారత జట్టు అమెరికాపై నెగ్గడం తెలిసిందే. ఇక, తదుపరి మ్యాచ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో భారత్ ఈ నెల 15న తలపడనుంది. శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగే ఈ మ్యాచ్ పై క్రికెట్ ప్రపంచమంతా దృష్టి సారిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవలి రాజకీయ పరిణామాలతో ఈ పోరుకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది.

## తెలంగాణలో 24 గంటల స్పోర్ట్స్ హాకథాన్

ప్రపంచంలోనే మొట్టమొదటి 24 గంటల నిరంతర స్టేడియం స్థాయి స్పోర్ట్స్ హాకథాన్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక లోగో, పోస్టర్‌ను క్రీడా, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం నాడు ఆవిష్కరించారు. మార్చి 28, 29 తేదీలలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ క్రీడా వేడుకను నిర్వహించనున్నారు. ఈ వినూత్న కార్యక్రమం క్రీడలు, సాంకేతిక ఆవిష్కరణలను ఒకే వేదికపై సమన్వయం చేసే ప్రపంచ ప్రథమ ప్రయత్నంగా నిలువనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ స్పోర్ట్స్ హాకథాన్‌లో తాను స్వయంగా రెండు రోజులపాటు పాల్గొంటానని ప్రకటించారు. రాష్ట్ర యువతను ప్రోత్సహించడం, క్రీడా రంగాన్ని బలోపేతం చేయడం, తెలంగాణను క్రీడా ఆవిష్కరణల కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ స్పోర్ట్స్ హాకథాన్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి యువత, క్రీడాకారులు, విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు, స్టార్టప్‌లు పాల్గొంటారని తెలిపారు. ఒకే స్టేడియంలో సుమారు 10వేల మంది పాల్గొనే ఈ మహత్తర కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ హాకథాన్ బ్రాండ్ యజమాని సుందీప్ కుమార్ మక్తాల తదితరులు పాల్గొన్నారు.



## చిన్నస్వామి.. ఆర్సీబీ రైట్ రైట్

2026 ఐపీఎల్ మార్చి చివరిలో ప్రారంభం కానుంది. కానీ, డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తన సొంత మ్యాచ్‌లను ఎక్కడ ఆడుతుందో తెలియక ఇన్ని రోజులు అభిమానులు తలలు పట్టుకున్నారు. తాజాగా, కర్ణాటక ప్రభుత్వం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ జట్టు తన సొంత మ్యాచ్‌లను ఆడటానికి అనుమతి ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. కున్హా నివేదిక సిఫార్సు చేసిన విధంగా స్టేడియంలో కొన్ని సౌకర్యాలను అందించడానికి ఇప్పటికే పని జరుగుతోంది. అందువల్ల, నిపుణుల కమిటీ నివేదిక మ్యాచ్‌లను నిర్వహించడానికి అనుమతి ఇవ్వవచ్చని పేర్కొంది. ఇప్పుడు, నిపుణుల కమిటీ నివేదికపై మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఐపీఎల్‌తో పాటు మౌలిక సదుపాయాలతోపాటు కీలక పనులు కూడా జరగనున్నాయి. నిపుణుల కమిటీ ఈ పనులను పర్యవేక్షిస్తుంది. దీని కింద, కమిటీ సీటింగ్ కూడా సమీక్షిస్తుంది.

## 15 ఏళ్ల తర్వాత కిర్‌స్టెన్!

టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో అరుదైన సంఘటన జరిగింది. గతంలో భారత జట్టుకు సేవలు అందించిన ప్రముఖ కోచ్ గారీ కిర్‌స్టెన్ దర్శనమిచ్చారు. నమీబియాతో గురువారం భారత్ మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ సందర్భంగా భారత జట్టుకు 15 సంవత్సరాల కిందట సేవలు అందించిన గారీ క్రిస్టెన్ దర్శనమిచ్చారు. 15 ఏళ్ల కిందట భారత జట్టుకు కిర్‌స్టెన్ కోచ్‌గా వ్యవహరించాడు. ఆయన నేతృత్వంలోనే టీమిండియా వరల్డ్ కప్‌ను ఒడిసి పట్టింది. ఆ తర్వాత కోచ్ పదవి నుంచి తప్పుకున్నారు. అయితే ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చారు. ప్రస్తుతం నమీబియా జట్టుకు మెంటార్‌గా గారీ వ్యవహరిస్తున్నారు.

# నేపాల్‌ను ఉతికేసిన ఇటలీ బ్రదర్స్

**10 వికెట్ల తేడాతో ఘనవిజయం**

**12.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన ఇటలీ**



టీ20 ప్రపంచకప్ 2026లో ఇటలీ జట్టు సంచలనం సృష్టించింది. టోర్నీలో తమ తొలి విజయాన్ని అత్యంత ఘనంగా నమోదు చేసింది. గురువారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో, ఇటలీ ఏకంగా 10 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. సోదరులైన ఓపెనర్లు జస్టిన్ మొస్కా, ఆంథోనీ మొస్కా విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగి, ఒక్క వికెట్ కూడా పడకుండా తమ జట్టును గెలిపించారు. ఈ టోర్నీ చరిత్రలోనే ఇటలీకి ఇది తొలి విజయం కావడం విశేషం. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో, ఇటలీ ఓపెనర్లు ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కు గట్టిపోటీ ఇచ్చిన నేపాల్ బౌలర్లకు వారు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. పవర్‌ప్లే ముగిసేసరికి ఇటలీ వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసి తన ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. ముఖ్యంగా జస్టిన్ మొస్కా 44 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో అతని సోదరుడు ఆంథోనీ మొస్కా మరింత దూకుడుగా ఆడి కేవలం 32 బంతుల్లో 3 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 62 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వీరిద్దరూ కలిసి 12.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. ఈ క్రమంలో ఈ సోదరులు ఓ అరుదైన రికార్డును కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. టీ20 ప్రపంచకప్‌లో తోబుట్టువులు నెలకొల్పిన అత్యధిక భాగస్వామ్యం (124లి) రికార్డును సృష్టించారు. గతంలో 2014లో పాకిస్థాన్‌కు చెందిన కమ్రాన్ అక్మల్, ఉమర్ అక్మల్ నెలకొల్పిన 96 పరుగుల భాగస్వామ్యాన్ని వీరు అధిగమించారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నేపాల్, ఇటలీ బౌలర్ల ధాటికి 19.3 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. ఇటలీ బౌలర్ క్రిషన్ కలుగామగే (3/18) కీలక వికెట్లు పడగొట్టి నేపాల్ పతనాన్ని శాసించాడు. నేపాల్ జట్టులో ఆసిఫ్ షేక్ (26), కెప్టెన్ రోహిత్ పౌడెల్ (23) మాత్రమే కాస్త రాణించారు. ఒక దశలో 98 పరుగులకు 5 వికెట్లతో ఉన్న నేపాల్, చివరి 25 పరుగులకే మిగిలిన 5 వికెట్లను కోల్పోయి తక్కువ స్కోరుకే పరిమితమైంది.



## ఒమన్‌పై శ్రీలంక విన్

టీ20 వలర్డ్‌కప్‌లో రెండో విక్టరీ నమోదు చేసింది శ్రీలంక. ఇవాళ ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 రన్స్ తేడాతో ఆ జట్టు విజయం సాధించింది. గ్రూప్ బీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో తొలుత శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 రన్స్ చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఒమన్ 9 వికెట్లు కోల్పోయి కేవలం 120 రన్స్ మాత్రమే చేయగలిగింది. ఒమన్ బ్యాటర్లలో నదీమ్ 53, వాసిమ్ అలీ 27 రన్స్ చేశారు. లంక బౌలర్లలో దుశమంత చమీరా, మహేశ్ తీక్షణ చెరి రెండేసి వికెట్లు తీసుకున్నారు. శ్రీలంక బ్యాటర్లలో శనక, పవన్ రత్ననాయకే, కుశాల్ మెండిస్ హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. దీంతో శ్రీలంక భారీ స్కోరు చేసింది. మెండిస్ 45 బంతుల్లో 61 రన్స్, శనక 20 బంతుల్లో 50, రత్ననాయకే 28 బంతుల్లో 60 రన్స్ చేశారు.

## ఖతార్ ఓపెన్‌లో స్వియటెక్, రిబకీనా జోరు



ఖతార్ ఓపెన్‌లో పోలిష్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియటెక్ అద్భుతమైన పోరాట పటిమ కనబర్చింది. దరియా కసాత్కినాతో జరిగిన మ్యాచులో తొలి గేమ్ ఓడినా.. ఆ తర్వతా పుంజుకొని విజయం సాధించింది. రష్యాలో పుట్టిన ఆస్ట్రేలియా అమ్మాయి కసాత్కినా 5-7తో తొలి గేమ్ తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత రెచ్చిపోయిన స్వియటెక్ వరుసగా 6-1, 6-1 తేడాతో ఆమెను చిత్తు చేసి ఖతార్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్ చేరింది. గతంలో 2022, 2023, 2024లో ఖతాన్ ఓపెన్ విజేత ఇగానే కావడం గమనార్హం. ఇటీవలే ఆస్ట్రేలియా ఓపెన్ నెగ్గి జోరు మీదున్న ఎలీనా రిబకీనా కూడా ఖతాన్ ఓపెన్‌లో జోరు కొనసాగించింది. చైనాకు చెందిన ఝెంగ్ కిన్వెన్ చేతిలో తొలి గేమ్ కోల్పోయిన రిబకీనా ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. వరుసగా 4-6, 6-2, 7-5 తేడాతో మ్యాచ్ నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.


ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 13-2-2026

# నేటి మేటి నాయకుడు రాఘవ్ చద్దా



నేటి భారత రాజకీయ యవనికపై తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న యువ నాయకుడు రాఘవ్ చద్దా. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆఫ్) తరపున రాజ్యసభలో అత్యంత పిన్న వయస్కుడైన ఎంపీగా అడుగుపెట్టిన ఆయన, కేవలం ఒక పార్టీ ప్రతినిధిగానే కాకుండా, దేశ గొంతుకగా మారుతున్నారు. వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ కావడంతో, సంక్లిష్టమైన ఆర్థిక అంశాలను సామాన్యులకు సైతం అర్థమయ్యేలా విశ్లేషించడంలో ఆయన శైలి అద్వితీయం. ఇటీవల పార్లమెంటులో ఆయన ప్రవేశపెట్టిన 'రైట్ టు రీకాల్' ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 'ఓటరు ఒక నాయకుడిని ఎన్నుకోగలిగినప్పుడు, ఆ నాయకుడు విఫలమైతే పదవి నుంచి తొలగించే అధికారం కూడా ఓటరుకు ఉండాలి' అని ఆయన గట్టిగా వాదించారు. ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనాన్ని పెంపొందించే ఇటువంటి సాహసోపేతమైన ఆలోచనలు యువతను రాజకీయాల వైపు ఆకర్షిస్తున్నాయి. రాజ్యసభలో 2026–27 బడ్జెట్ చర్చల సందర్భంగా ఆయన చేసిన ప్రసంగాలు ఎంతో లోతైనవి. మనం ఇంగ్లాండ్‌లో వలె పన్నులు చెల్లిస్తున్నాం, కానీ సోమాలియా వంటి సేవలను అందుకుంటున్నాం అని ఆయన చేసిన వ్యాఖ్య పన్ను చెల్లింపుదారుల వాస్తవ స్థితికి అద్దం పట్టింది. క్రిప్టోకరెన్సీలు, వర్చువల్ డిజిటల్ అసెట్స్‌ను నిషేధించే బదులు, వాటిని చట్టబద్ధం చేసి క్రమబద్ధీకరించడం ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ. 20,000 కోట్ల ఆదాయం వస్తుందని సూచించారు. భూ రికార్డులను బ్లాక్‌చైన్ సాంకేతికతతో డిజిటలైజ్ చేయాలని కోరడం ద్వారా అవినీతి రహిత పాలన పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు. రాఘవ్ చద్దా కేవలం ప్రసంగాలకే పరిమితం కాలేదు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో (2022) ఆప్ సాధించిన చారిత్రక విజయ వెనుక ఆయన వ్యూహరచన కీలకమైంది. ఢిల్లీ జల్ బోర్డు వైస్ చైర్మన్‌గా ఉన్నప్పుడు మంచినీటి సరఫరా వ్యవస్థలో ఆయన తెచ్చిన మార్పులు అభినందనీయం. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ గ్లోబల్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నుంచి యంగ్ గ్లోబల్ లీడర్ గుర్తింపు పొందడం ఆయన నాయకత్వ పటిమకు అంతర్జాతీయ సాక్ష్యాలు. ఆధునిక సాంకేతికతను, ఆర్థిక శాస్త్రాన్ని రాజకీయాల్లో మేళవిస్తూ, ప్రజా సమస్యలపై నికరమైన గొంతు వినిపిస్తున్న రాఘవ్ చద్దా, భావిభారత రాజకీయాల్లో ఒక బలమైన శక్తిగా ఎదుగుతారనడంలో సందేహం లేదు. యువతరం కోరుకునే చదువుకున్న, సంస్కారవంతమైన, నిబద్ధత కలిగిన నాయకుడిగా రాఘవ్ చద్దా దార్శనికుడు.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**




ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది పౌరుడికి ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం. అయితే, ఒకసారి ప్రతినిధిని ఎన్నుకున్నాక, సదరు నేత తన ఐదేళ్ల పదవీ కాలంలో ప్రజలకు అందుబాటులో లేకపోయినా, అవినీతికి పాల్పడినా లేదా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినా.. మళ్ళీ వచ్చే ఎన్నికల వరకు వేచి చూడటం తప్ప ఓటరుకు మరో మార్గం లేదు. ఈ నేపథ్యంలో తెరపైకి వచ్చిందే రైట్ టు రీకాల్. ఎన్నుకునే హక్కుతో పాటు, సక్రమంగా పనిచేయని ప్రతినిధిని పదవి నుంచి వెనక్కి పిలిపించే హక్కు కూడా ఓటరుకు ఉండాలన్నదే ఈ సిద్ధాంతం. ఇదే ప్రజాస్వామ్యానికి అసలైన జవాబుదారీతనం.

# రైట్ టు రీకాల్

### భారత్‌లో..

భారత రాజ్యాంగంలో ఎంపీలు, ఎమ్మెల్యేల స్థాయికి రీకాల్ నిబంధన లేదు. అయితే, కొన్ని రాష్ట్రాలు తమ స్థానిక సంస్థల (పంచాయితీలు, మున్సిపాలిటీలు) చట్టాల్లో దీనిని చేర్చాయి.

మధ్యప్రదేశ్: దేశంలోనే తొలిసారిగా స్థానిక సంస్థల్లో రీకాల్ చట్టాన్ని ప్రవేశపెట్టింది (1999).

ఛత్తీస్‌గఢ్: 2008లో ఈ చట్టం కింద కొంతమంది సర్పంచులను విజయవంతంగా తొలగించారు.

బీహార్: సర్పంచ్, గ్రామ పంచాయితీ సభ్యులపై రీకాల్ నిబంధనలు ఉన్నాయి.

హర్యానా: ఇటీవల సర్పంచులను వెనక్కి పిలిచే చట్టాన్ని ఆమోదించింది.

ఇతర రాష్ట్రాలు: ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ (అవిశ్వాస తీర్మానం రూపంలో) వంటి రాష్ట్రాల్లో వివిధ స్థాయిల్లో అమల్లో ఉంది.



ఒక ప్రతినిధిని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉన్నట్లే, ఆ ప్రతినిధి సరిగ్గా పని చేయనప్పుడు పదవి నుంచి తొలగించే హక్కు ఉండటమే రైట్ టు రీకాల్.. ఐదేళ్ల కాలపరిమితి ముగిసే వరకు వేచి చూడకుండా, మధ్యలోనే ఓటర్లు తమ అసంతృప్తిని ఓటు ద్వారా తెలియజేసి ప్రతినిధిని వెనక్కి పిలిపించే ప్రక్రియ ఇది. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా పార్లమెంటులో ఈ అంశంపై గళం విప్పారు. నేతలు ఎన్నికలయ్యాక ప్రజలను మర్చిపోతున్నారని, ఐదేళ్ల బానిసత్వం నుంచి ఓటరుకు విముక్తి కలగాలంటే రీకాల్ హక్కు ఉండాలని వాదించారు. ఈ చట్టం దుర్వినియోగం కాకుండా.. కనీసం 35–40% ఓటర్ల సంతకాలతో కూడిన పిటిషన్ వంటి కఠిన నిబంధనలు ఉండాలని సూచించారు.

### జవాబుదారీతనం కావాలి

రైట్ టు రీకాల్ అమల్లో ఉంటే.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రతినిధుల్లో పదవి పోతుందనే భయం ఉంటుంది. అధికారాన్ని దుర్వినియోగం చేసే నాయకులను తొలగించడం ద్వారా అవినీతిని అరికట్టవచ్చు. రాజకీయాల్లో పెరుగుతున్న నేరచరితులను నియంత్రించడానికి ఇది ఒక అస్త్రంలా పనిచేస్తుంది. ఓటు వేయడంతోనే బాధ్యత ముగిసిందని కాకుండా, నిరంతరం నిఘా ఉంచేలా ఓటర్లను ప్రోత్సహిస్తుంది. అయితే ఈ చట్టం వల్ల కొన్ని ప్రతికూలతలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పదే పదే ఉప ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందని, రాజకీయ కక్ష సాధింపులకు ఇది వేదికగా మారుతుందని, ఫలితంగా పాలన అస్థిరంగా మారుతుందని వాదిస్తున్నారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషీ వంటి వారు కూడా భారతీయ పరిస్థితుల్లో దీని అమలు కష్టమని అభిప్రాయపడ్డారు. భారతదేశం వంటి అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఎంపీ, ఎమ్మెల్యే స్థాయిల్లో ఈ చట్టం తేవడం కష్టసాధ్యమే అయినా, స్థానిక సంస్థల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపడం అవసరం. పారదర్శకమైన నిబంధనలతో ఈ హక్కును అమలు చేస్తే ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టమవుతుంది.



### రాఘవ్ చద్దా ప్రతిపాదనలు

కనీస కాలపరిమితి: ఎన్నికైన వెంటనే కాకుండా, 18 నెలల కాలం గడిచిన తర్వాతే రీకాల్ ప్రక్రియను ప్రారంభించాలి.

అర్హత: ప్రతినిధి అవినీతికి పాల్పడటం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటేనే ఈ హక్కును వినియోగించుకోవాలి.

ప్రక్రియ: నియోజకవర్గంలోని కనీసం 35% నుంచి 40% ఓటర్లు ధ్రువీకరించిన పిటిషన్ ద్వారా ఈ ప్రక్రియను మొదలుపెట్టాలి.

అంతిమ ఓటింగ్: రీకాల్ ఓటింగ్‌లో 50% కంటే ఎక్కువ మంది ఓటర్లు ప్రతినిధి తొలగింపుకు మద్దతు తెలపాలి.

### ఏయే దేశాల్లో ఎలా?

- అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో రైట్ టు రీకాల్ విధానం వివిధ రూపాల్లో అమల్లో ఉంది.
- స్విట్జర్లాండ్: ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి నిలయమైన ఇక్కడ 19వ శతాబ్దం నుంచే కొన్ని కాంటన్లలో (రాష్ట్రాలు) ఈ హక్కు ఉంది.
- అమెరికా: దాదాపు 19 రాష్ట్రాల్లో స్థానిక, రాష్ట్ర స్థాయి అధికారులను రీకాల్ చేసే అవకాశం ఉంది. ఉదాహరణకు, కాలిఫోర్నియా గవర్నర్లను గతంలో రీకాల్ ప్రక్రియ ద్వారా తొలగించారు.
- కెనడా: బ్రిటిష్ కొలంబియా వంటి ప్రాంతాల్లో 1995 నుండి ఈ చట్టం అమల్లో ఉంది.
- వెనిజులా: అధ్యక్షుడిని కూడా రీకాల్ చేయవచ్చు
- ఫిలిప్పీన్స్: రాజ్యాంగబద్ధంగా ఈ హక్కు కల్పించారు.

### రైట్ టు రీకాల్ అంటే..

సాధారణంగా మనం ఒక అభ్యర్థిని ఐదేళ్ల కాలానికి ఎన్నుకుంటాం. ఆ కాలంలో సదరు ప్రతినిధి సరిగ్గా పనిచేయకపోయినా, అవినీతికి పాల్పడినా లేదా ఇచ్చిన హామీలను విస్మరించినా.. వచ్చే ఎన్నికల వరకు ఓటరు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. కానీ, రైట్ టు రీకాల్ చట్టం ప్రకారం ఎన్నికైన ప్రతినిధి తన విధుల్లో విఫలమైతే, పదవీకాలం ముగియకముందే అతడిని తొలగించే అధికారం ఓటర్లకు ఉంటుంది. ప్రజలు మెజారిటీతో అసమ్మతి తెలిపితే, ఆ ప్రతినిధి పదవి కోల్పోతారు మరియు అక్కడ తిరిగి ఉపఎన్నిక జరుగుతుంది.



గంగాధర్
ఈవార్తలు దినపత్రిక చైర్మన్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.